నేటి కందం-నేటికి అందం

వేసారు బాటసారులు
శ్వాసను బీల్చంగలేని జటిల సమస్యన్
దాసిన పెద్దలు కట్టిన
మూసారాంబాగు బ్రిడ్జి ముదమును గూర్చెన్ !!

(ప్రజల ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించడానికి కట్టబడిన మూసారాం బాగ్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించడంతో ఆప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు చాలవరకు తగ్గిపోయాయని ప్రజలు సంతోషిస్తున్నారు)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

ప్రతిపక్షం అధినేతకు
ప్రగతి చూపు పట్టిలేదా
అసెంబ్లీకి రాకపోతే
అతని పాత్ర వట్టిపోదా
పదేళ్ల రాష్ట్రాన్ని
పాలించిన తన కీర్తి
మౌనమైతే వ్యర్థమే
మృగ్యమే తన స్ఫూర్తి.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ బుధవారం 2-9-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:26 పేజీలు:6 వెల: రూ.1/-


## మోదీతో పుతిన్, జిన్‌పింగ్ భేటీ.. ఎస్సీవో సదస్సులో అరుదైన భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: కిర్గిస్తాన్‌లో జరుగుతున్న ఎస్సీవో సదస్సులో అరుదైన భేటీ జరిగింది. చాలా కాలం తర్వాత ప్రధాని మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ముగ్గురూ ఒకేసారి వేదికపై చేరి, ఒకరికొకరు కరచాలనం చేసుకున్నారు. ముగ్గురూ కొద్దిసేపు సంభాషించుకున్నారు. కిర్గిస్తాన్‌లోని బిష్కెక్‌లో 26వ ఎస్సీవో సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలు పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా మోదీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెలలోనే మోదీ, జిన్‌పింగ్ మరోసారి భేటీ కానుండటం విశేషం. ఈ నెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు జిన్‌పింగ్ హాజరుకానున్నారు. దీంతో మరోసారి మోదీ, జిన్‌పింగ్ భేటీ కావడం ఖాయం. ఈ పర్యటన సందర్భంగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇక, ఎస్సీవో సదస్సులో మోదీ మాట్లాడారు. పక్కనే ఉన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందే తీవ్రవాదం గురించి మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు.

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు.

హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. LBS లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారు.

MIT అమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హై కోర్టులో ఊరట

హైదరాబాద్,సెప్టెంబర్ 1: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది.

తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరపున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

## ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలి: పొన్నం ప్రభాకర్



హైదరాబాద్,సెప్టెంబర్ 1: సెప్టెంబర్ 14 నుంచి జరిగే గణేశ్ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రిగా సన్నాహక సమావేశం జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితితో సమావేశం జరిగిందని.. ఉత్సవాల ప్రశాంతంగా జరగడంపై చర్చించినట్లు చెప్పారు. సామూహిక ఉత్సవాలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేశ్ మండపాల నిర్వహణ, శానిటేషన్, భద్రత, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటుపై చర్చించామన్నారు. భక్తులకు మొక్కల పంపిణీ చేయాలని, చేనేత కండువాలు వాడాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితిని కోరామన్నారు.మట్టి వినాయకులను వాడి... పర్యావరణాన్ని కాపాడాలని మంత్రి పిలుపునిచ్చారు. బోనాల ఉత్సవాల సమయంలో మంచి వర్షాలు కురవాలని అన్ని ఆలయాల్లో పూజలు చేసినట్లు తెలిపారు. వినాయక మండపాల్లో ఎల్‌నినో కష్టాల నుంచి గట్టెక్కించి.. మంచి వర్షాలు కురవాలని పూజలు చేయాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితికి ప్రభుత్వం నుంచి సూచించామన్నారు. కోర్టులను గౌరవిస్తూనే ఉత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ప్రజలే స్వచ్ఛందంగా ఉత్సవాలు జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

**నారాయణఖేడ్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.**




సంగారెడ్డి, సెప్టెంబర్ 01(నేటి నిజం ప్రతినిధి)నారాయణఖేడ్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, రైతుల సమస్యలు, రహదారులు, విద్య, వైద్యం, తాగునీరు తదితర అంశాలపై అధికారులు, సర్పంచులతో ఎమ్మెల్యే సమీక్షించారు. గ్రామాల నుంచి సర్పంచులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులను గుర్తించి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వారికి అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతుల సమస్యలు, రహదారుల అభివృద్ధి, విద్యా సంస్థలు, వైద్య సేవలు, తాగునీరు తదితర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ప్రధాన కార్యదర్శి



నారాయణపేట, సెప్టెంబర్ 1: రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఐఏఎస్ గురువారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు.

ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు.

అనంతరం చింతల్‌దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల, కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన పటం, పనుల కాలపట్టికతో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారు లను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో పాటు చింతల్‌దిన్నె సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా, సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఆదేశించారు.

## కాంగ్రెస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షులుగా దూలం భూమేష్ గౌడ్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1:(నేటినిజం ప్రతినిధి): :కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ ఉపాధ్యక్షులుగా దూలం భూమేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వేములవాడ పట్టణ అధ్యక్షులు తూం మధు ఆదివారం ఉదయం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ పట్ల చురుకైన కార్యకర్తగా, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్న దూలం భూమేష్ గౌడ్‌ను పట్టణ ఉపాధ్యక్షులుగా నియమించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పట్టణ ఉపాధ్యక్షులు దూలం భూమేష్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ కి, పట్టణ మాజీ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్ కి, ప్రస్తుత పట్టణ అధ్యక్షులు తూం మధుకి, పార్టీ సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని భూమేష్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తానన్నారు. వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగుతానని చెప్పారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు అప్పగించిన పదవిని ఒక బాధ్యతగా భావిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తానని, పార్టీ కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ కార్యకర్తలకు అండగా నిలుస్తానని దూలం భూమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

## విద్యార్థులపై కేసులన్నింటినీ కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ, సెప్టెంబర్ 1: జూలై 20న కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనల క్రమంలో విద్యార్థులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు ఇవాళ రద్దు చేసింది. క్రిమినల్ నేపథ్యం ఉన్న వారి మినహా, జూలై 20 నుంచి 25 వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నమోదైన కేసులన్నింటినీ కొట్టివేస్తూ కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో సంతృప్తి చెందిన సీజేపీ, సెప్టెంబర్ 5న ఢిల్లీలో తలపెట్టిన భారీ మార్చ్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది.

జూలై 20 నాటి సీజేపీ నిరసనలకు సంబంధించి దాఖలైన కేసులను ఉపసంహరించుకుంటామని, అలాగే ఈ వ్యవహారంలో భవిష్యత్తులో కొత్త ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని కూడా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది.

క్రిమినల్ చరిత్ర ఉన్న 2,873 మంది వ్యక్తులపై జంతర్ మంతర్ నిరసనలకు సంబంధించి ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఒక ఎఫ్ఐఆర్‌ను కొనసాగించడానికి కోర్టు అనుమతించింది. జూలై 25న ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ బీహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం (ఢిల్లీ పోలీసులు) సంయుక్తంగా ఎఫ్ఐఆర్‌ల రద్దు కోసం దరఖాస్తులు దాఖలు చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

## కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై స్టే ఎత్తేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 1: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. ఈ రెండు పథకాలపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం ఎత్తివేసింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై హైకోర్టు సింగిల్ ధర్మాసనం విధించిన స్టేను సవాల్ చేస్తూ రాష్ట్ర సర్కార్.. డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేయగా.. ఈరోజు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలపై సింగిల్ బెంచ్ స్టే విధించడం వల్ల పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ పథకం వల్ల ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు మేలు జరుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పథకాల చట్టబద్ధతను సవాల్ చేస్తూ సింగిల్ బెంచ్‌లో వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని తెలిపారు. పథకం అమలుపై ఉన్న స్టేను ఎత్తివేయాలని కోరారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన సీజే ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## అర్హులందరికీ పథకాలు అందాలి

**ఎస్సీ, ఎస్టీలకు మానవీయ కోణంలో సేవలు**
**కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1:(నేటినిజం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. మంగళవారం ఐడీఓసీలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బి.గితెతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సకాలంలో పరిహారం అందించాలని ఆదేశించారు. ప్రతినెలా మండలాల్లో సివిల్ రైట్స్ డే, మూడు నెలలకు ఒకసారి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో చేరేలా చూడాలని, ప్రజలకు మానవీయ కోణంలో సేవలందించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ ఖాతాలు తెరిపించి బీమా సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో కామన్ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 32 అట్రాసిటీ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఎస్సీలకు 2,315, ఎస్టీలకు 436 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు.

# నేడే 2వ ప్రపంచ యుద్ధ ముగింపు జరిగిన రోజు

## (సెప్టెంబర్ 02న "రెండవ ప్రపంచ యుద్ధ ముగింపు దినం" సందర్భంగా)

"రెండవ ప్రపంచ యుద్ధ ముగింపు దినం" లేదా 'జపాన్‌పై విజయ దినోత్సవం', దీనిని "విక్టరీ ఓవర్ జపాన్ డే లేదా "వి-జె డే" అని కూడా పిలుస్తున్నాం. ఇది 1945 సెప్టెంబర్ 2న రెండవ ప్రపంచ యుద్ధంలో సామ్రాజ్యవాద జపాన్ లొంగిపోయి, యుద్ధాన్ని అధికారికంగా ముగించడానికి సంతకం చేసిన రోజు. 1945 ఆగస్టు 15న జపాన్ లొంగిపోతున్నట్లు తొలి ప్రకటన వెలువడిన రెండు రోజులకూ ఎవి డే అనే పదాన్ని వర్తింపజేశారు. 1945 ఆగస్టు 14/15 యునైటెడ్ కింగ్‌డమ్ (ఐఐ)కు అధికారిక "ఎ-ఏ డే" కాగా, అమెరికాలో అధికారికంగా 1945 సెప్టెంబర్ 2న ఎ-ఏ డే నిర్వహించారు. అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్. ట్రూమన్, అమెరికాలో ఆగస్టు 14న జపాన్ బేషరతుగా లొంగిపోవడాన్ని అంగీకరించినట్లు ప్రకటించారు, అయితే సమయ మండలాల వ్యత్యాసాల కారణంగా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా మరియు ఆసియాలో ఇది ఆగస్టు 15న జరిగింది. టోక్యో బేలోని జూూ మిస్సోరీ నౌకలో అధికారిక లొంగిపోయే సంతకాలు చేసే వేడుక జరిగింది, దీనిని అమెరికా అధికారికంగా 'ఎ-ఏ డే'గా ప్రకటించింది.

### అత్యంత రక్తపాతమైన, అతిపెద్ద సంఘర్షణ :

అమెరికా 06 ఆగస్టు 1945 రోజున హిరోషిమాపై, ఆగస్టు 9, 1945 రోజునన నాగసాకిపై అణుబాంబులు వేయడంతో, జపాన్ ఓటమిని అంగీకరించి లొంగిపోవడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది. రెండవ ప్రపంచ యుద్ధాన్ని ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద, అత్యంత ప్రాణాంతకమైన మరియు అత్యంత విధ్వంసకరమైన యుద్ధాలలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ ఎ-ఏ డే ఈ భూమిపై స్వేచ్ఛా చరిత్రలో ఒక కొత్త ప్రారంభం. రెండవ ప్రపంచ యుద్ధం 1939 సెప్టెంబర్ 1న ప్రారంభమై, చివరకు 1945 సెప్టెంబర్ 2న అధికారికంగా ముగిసింది. నాజీ జర్మనీ 8 మే 1945 రోజు బేషరతుగా లొంగిపోయిన సందర్భంగా వారు ఈ రోజును ఎ-ఇ డే (విక్టరీ ఆఫ్ యూరప్ డే) అని పిలిచారు.

ఈ ప్రపంచ సంఘర్షణ రెండు ప్రధాన కూటముల మధ్య జరిగింది, అవి అల్లీస్ రాజ్యాలు (ప్రధానంగా గ్రేట్ బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్ మరియు చైనా నేతృత్వంలో) మరియు అక్సిస్ పవర్ రాజ్యాలు (జర్మనీ, ఇటలీ మరియు జపాన్ నేతృత్వంలో). వివిధ అంచనాల ప్రకారం, 60 నుండి 85 మిలియన్ల మంది ప్రజలు మరణించారు, వీరిలో అత్యధికులు, అంటే దాదాపు 55 మిలియన్ల మంది సాధారణ పౌరులు ఉన్నారు. ఇది మానవ చరిత్రలోనే అత్యంత ప్రాణాంతకమైన, రక్తపాతమైన సంఘర్షణగా నిలిచింది. సామూహిక హత్యాకాండలు, ఆకలి, వ్యాధులు, హోలోకాస్ట్‌తో సహా జాతి నిర్మూలనల ఫలితంగా లక్షలాది మంది మరణించారు.

### రెండవ ప్రపంచ యుద్ధానికి కారణాలు :

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పరిష్కారం కాని ఉద్రిక్తతలు రెండవ ప్రపంచ యుద్ధానికి కారణం అయ్యాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ విధించిన కఠినమైన శాంతి షరతులు, పోలాండ్‌పై దాని దాడి, జర్మనీకి చెందిన అడాల్ఫ్ హిట్లర్, ఇటలీకి చెందిన బెనిటో ముస్సోలినీ వంటి నియంతలు రెండవ ప్రపంచ యుద్ధానికి ప్రధాన కారణాలుగా చెప్పుకోవచ్చు. అల్లీస్ రాజ్యాల దళాలు బెర్లిన్‌ను చుట్టుముట్టడం, ఏప్రిల్ 30, 1945న హిట్లర్ ఆత్మహత్య చేసుకోవడం, అమెరికా జపాన్‌పై బాంబు దాడులు చేయడం, ఫలితంగా సెప్టెంబర్ 02, 1945న జపాన్ అధికారికంగా లొంగిపోవడం వంటివి ఈ యుద్ధ ముగింపుకు దారితీశాయి. యుద్ధానికి ముందు జరిగిన కీలక సంఘటనలలో 1931లో జపాన్ మంచూరియాపై దాడి, స్పానిష్ అంతర్యుద్ధం, 1937లో రెండవ సినో-జపనీస్ యుద్ధం, జర్మనీ ఆస్ట్రియాను స్వాధీనం చేసుకోవడం, పోలాండ్/సుడెటెన్‌ల్యాండ్‌లపై దాడి చేయడం వంటివి సెప్టెంబర్ 01, 1939న రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభానికి ఆజ్యం పోశాయి.

దాదాపు ఆరు సంవత్సరాల పాటు జరిగిన వినాశకరమైన ప్రపంచ సంఘర్షణ తరువాత, 1945 మేలో నాజీ జర్మనీ, సెప్టెంబర్‌లో సామ్రాజ్యవాద జపాన్ ఓటమితో రెండవ ప్రపంచ యుద్ధం అధికారికంగా ముగిసింది. రెండవ ప్రపంచ యుద్ధం ప్రభావంతో అమెరికా, సోవియట్ యూనియన్ కొత్త అగ్రరాజ్యాలుగా ఆవిర్భవించి, ప్రచ్ఛన్న యుద్ధం ప్రారంభానికి రంగం సిద్ధం చేశాయి. అంతర్జాతీయ శాంతిని కాపాడటానికి, భవిష్యత్తులో ప్రపంచ సంఘర్షణలను నివారించడానికి అప్పుడే ఐక్యరాజ్యసమితి స్థాపించబడింది.



-మధుపాలీ
9949700037

# విద్యార్థులు మన మూలాలను, సాంస్కృతిక విలువలను విస్మరించకుండా...
# అంతర్జాతీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:న్యూఢిల్లీలో ఈ రోజు (2026 ఆగస్టు 31) నిర్వహించిన 18 జాతీయ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ (నిఫ్ట్)ల సంయుక్త స్నాతకోత్సవానికి భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము హాజరయ్యారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... జౌళీ, వస్త్ర పరిశ్రమ రంగం మన సాంస్కృతిక వారసత్వంలో భాగం మాత్రమే కాదని, లక్షలాది మంది ప్రజల జీవనోపాధికి వెన్నెముకగా కూడా నిలిచిందని రాష్ట్రపతి అన్నారు. సంప్రదాయ కళాకారులకు తగిన సహకారమూ, మార్గనిర్దేశమూ లభిస్తే.. వారి భవిష్యత్తు తరాలు కూడా సగర్వంగా, ఆత్మవిశ్వాసంతో ఈ వృత్తిలో కొనసాగేలా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. తమ ప్రాంతాల్లోని నేత కార్మికులకూ, చేతివృత్తి కళాకారులకూ జౌళీ, వస్త్ర రంగంలో ఆధునిక మెళకువలను పరిచయం చేయడంతోపాటు.. వారిని మార్కెట్లతో అనుసంధానించడం లక్ష్యంగా 'హస్తకళా బృంద కార్యక్రమా'ల వంటి కార్యాచరణను వివిధ నిఫ్ట్ కేంద్రాలు అమలు చేయడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

మునుపెన్నడూ లేనంత ఆత్మవిశ్వాసంతో.. నేడు మన దేశం అంతర్జాతీయ వేదికలపై తన పాత్రను విస్తరించుకుంటోందని రాష్ట్రపతి అన్నారు. ప్రపంచ స్థాయిలో దేశ ఉనికిని బలోపేతం చేయడంలో ఫ్యాషన్ టెక్నాలజీ రంగం కూడా విస్తృత పాత్రను పోషించగలదన్నారు. గ్రాడ్యుయేట్ విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ ప్రయత్నంలో విద్యార్థులు అంతర్జాతీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని, అయితే మన మూలాలనూ, మౌలిక సాంస్కృతిక విలువలనూ ఏమాత్రమూ విస్మరించొద్దని రాష్ట్రపతి సూచించారు. తద్వారా వారు విజయవంతమైన నిపుణులుగా ఎదగడమే కాకుండా.. భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో, సుసంపన్నం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారన్నారు.

విద్యార్థులు ప్రపంచ స్థాయి ఉత్పత్తులను, బ్రాండ్లను రూపొందించాలని, అయితే అవి పర్యావరణ అనుకూలంగా ఉండేలా కూడా చూసుకోవాలని రాష్ట్రపతి అన్నారు. ఉత్పత్తుల కోసం స్థానికంగా లభించే ముడి పదార్థాలను ఉపయోగించడం.. పర్యావరణ పరిరక్షణ దిశగా ఒక కీలక ముందడుగవుతుందని ఆమె పేర్కొన్నారు. మిగిలిపోయిన భాగాలను వ్యర్థాలుగా పారవేయకుండా.. వాటికి కొత్త రూపాన్ని, కొత్త వినియోగాన్ని, కొత్త విలువను కల్పించవచ్చని రాష్ట్రపతి వ్యాఖ్యానించారు. సంస్థ వ్యూహాత్మక ప్రణాళికలో సుస్థిరతకు, సామాజిక బాధ్యతకు నిఫ్ట్ విధాన రూపకర్తలు గణనీయమైన ప్రాధాన్యమివ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు. జౌళీ, వస్త్ర పరిశ్రమ రంగంలో సుస్థిర భవిష్యత్తు దిశగా చేస్తున్న ప్రయత్నాలకు అనుగుణంగా.. పునర్వినియోగ ఆర్థిక వ్యవస్థ పద్ధతులను మరింత విస్తరించి, ప్రయోజనకరంగా మార్చేలా నిఫ్ట్ సమర్థ చర్యలు తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి అన్నారు. నిఫ్ట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ప్రతిభావంతులైన యువ విద్యార్థులపై దేశం ఎన్నో అంచనాలను పెట్టుకుందన్నారు. దేశ పురోగతిలో భాగస్వామ్యం వహించేలా ప్రతి పౌరుడికీ తగిన అవకాశం లభించే సమాజాన్ని నిర్మించడంలో తమవంతు సహకారాన్ని అందించాలని వారిని కోరారు. కళ ప్రామాణిక అస్తిత్వాన్ని కాపాడుకుంటూ.. ఉత్పాదకతనూ, ఆదాయాన్నీ పెంచుకోవడంలో హస్తకళా నిపుణులకు సాయమందించేలా తీసుకునే చర్యలపైనే.. తమ విజయం ఆధారపడి ఉంటుందని రాష్ట్రపతి స్పష్టం చేశారు.

# కౌశాంబిలో టపాసుల కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం పట్ల ప్రధాని సంతాపం ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఎక్స్‌గ్రేషియాను ప్రకటించిన పీఎం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబిలో టపాసుల కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మరణించిన వారి కుటుం బాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్‌ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియాను శ్రీ మోదీ ప్రకటించారు.

"ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబిలో ఉన్న టపాసుల కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో సంభవించిన ప్రాణనష్టం తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేసున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను, గాయపడిన వారికి రూ.50,000 పరిహారాన్ని అందజేస్తాం.

# రష్యా అధ్యక్షునితో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:బిష్కక్ లో ఎస్‌సీఓ 26వ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా రష్యా అధ్యక్షుడు శ్రీ వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ సంవత్సరంలో వారు ఇద్దరూ భేటీ కావడం ఇది మొదటిసారి. 2025 డిసెంబరులో ఢిల్లీలో 23వ వార్షిక శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఈ నేతలు సమావేశమయ్యారు.

రాజకీయ, ఆర్థిక, రక్షణ, ఇంధన, అంతరిక్ష, అనుసంధాన, ప్రజా సంబంధాల రంగాలు సహా అనేక రంగాల్లో పరస్పర సహకారంలో నమోదైన పురోగతిని నేతలు ఇద్దరూ సమీక్షించారు. వాణిజ్య, ఆర్థిక, సాంస్కృతిక వ్యవహారాలపై ఏర్పాటు చేసిన భారత్, రష్యా అంతర్ ప్రభుత్వ సంఘం 27వ సదస్సు ఫలితాలను వారు హర్షించారు. ఈ సదస్సును 2026 ఆగస్టు 24న మాస్కోలో నిర్వహించారు.

భారత్ అధ్యక్షతన ఈ సంవత్సరంలో నిర్వహించనున్న బ్రిక్స్ సమావేశం సహా బహుళ పక్ష వేదికల్లో భారత్, రష్యా సహకారం అంశంపై నేతలు తమ ఆలోచనలను తెలియజేసుకొన్నారు. ఉభయ పక్షాల ప్రయోజనాలు ముడిపడి ఉన్న కీలక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపైన కూడా వారు తమ ఆలోచనలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా...పశ్చిమాసియా, నల్ల సముద్ర ప్రాంతంలో ప్రస్తుత సంఘర్షణల ప్రసక్తి కూడా వచ్చింది. ఈ సంఘర్షణలు నౌకావాణిజ్యంతో పాటు భారతీయ నావికుల భద్రతను ప్రభావితం చేస్తున్నాయి. సంఘర్షణలను పరిష్కరించుకోవడానికి చర్చలు, దౌత్యం.. ఇవే ముందు ఉన్న మార్గం అని ప్రధానమంత్రి మరో సారి స్పష్టం చేశారు.

రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన, విశేషాధికారాలతో కూడిన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా పటిష్ట పరుచుకోవడానికి కలిసి పనిచేయాలని ఇద్దరు నేతలు అంగీకరించారు. ఈ భాగస్వామ్యం నిరంతరాయంగా పురోగమన పథంలో సాగుతోంది. అంతేకాకుండా భౌగోళిక, రాజకీయ అస్థిరతలు నెలకొన్నప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.

ఈ ఏడాదిలో సెప్టెంబరు 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడానికి భారత్‌కు రానున్న అ

# పెంచిన పింఛన్ల దరఖాస్తుల గడువు
## సెప్టెంబర్ 15 వరకు అవకాశం..
## అర్హులు దరఖాస్తు చేసుకోవాలి: ఎంపీడీవో



ఆదిలాబాద్, ఆగష్టు 31: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయూత పింఛన్ల దరఖాస్తు గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించిందని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల అభివృద్ధి అధికారి కృష్ణవేణి తెలిపారు. తొలుత పింఛన్ల దరఖాస్తు గడువు 31వ తేదీ వరకు ఉండగా, అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం గడువును పొడిగించిందని చెప్పారు. అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోని వారు తమ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని ఎంపీడీవో కోరారు.

పెంచిన గడువు విషయాన్ని అర్హులైన ప్రజలకు తెలియజేసి, వారు దరఖాస్తు చేసుకునేలా గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు తగిన శ్రద్ధ చూపాలని సూచించారు. మంగళవారం భూసిమెట్ట గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో కృష్ణవేణి సర్పంచ్ ఆత్రం సింధు నగేష్, గ్రామస్తులతో మాట్లాడారు. పెంచిన గడువు వల్ల గతంలో దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని ఆమె తెలిపారు.

# గ్రామ సమస్యలపై దృష్టి సారించాలి: ఎంపీడీవో



ఆదిలాబాద్, ఆగష్టు 31: గ్రామపంచాయతీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జైనూర్ మండలం నూతన ఎంపీడీవో కృష్ణవేణి కోరారు. మంగళవారం ఆమె కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలోని భూసిమెట్ట గ్రామపంచాయతీని సందర్శించారు. సర్పంచ్ ఆత్రం సింధు నగేష్‌తో కలిసి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

గ్రామంలో పూరి గుడిసెల్లో నివసిస్తున్నవారితో పాటు గతంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు పాత ఇంటి గోడలపై స్లాబ్ నిర్మాణానికి ఇందిరమ్మ పథకం ద్వారా నిధులు మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యాబోధనను పరిశీలించి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. నూతన ఎంపీడీవో బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా పంచాయతీకి రావడంతో సర్పంచ్ సింధు నగేష్, ఉపసర్పంచ్, గ్రామస్తులు ఆమెను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పార్వతి, హశాసింగ్ ఏఈ సందీప్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాసిరకంగా చెక్‌డ్యామ్ నిర్మాణం.. భవిష్యత్తులో ప్రమాదం
## పనులు అర్ధంతరంగా నిలిపివేత.. నాణ్యతపై రైతుల ఆందోళన



ఆదిలాబాద్, ఆగష్టు 31:ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి సాగుకు ఉపయోగించేలా తెలంగాణ ప్రభుత్వం పలు నిర్మాణాలను చేపడుతోంది. ఇందులో భాగంగా కోట్లాది రూపాయలతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోంది. అయితే నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో పాటు నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని కుబీర్ మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని రాజూరా వ్యవసాయ శివారులోని వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.60 కోట్ల నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు సిమెంట్ మిశ్రమంతో నిర్మాణం చేపట్టి, ఇరువైపులా మట్టి కట్టలు పోశారు. ఈ కట్టలు వరద నీటికి కొట్టుకుపోకుండా బండరాళ్లు పేర్చాల్సి ఉండగా, ఈ ప్రాంతంలో బండరాళ్లు లభించడం లేదనే కారణంతో పనులను అర్ధంతరంగా నిలిపివేసినట్లు స్థానిక రైతులు చెబుతున్నారు.

ఇదిలా ఉండగా రూ.1.60 కోట్లతో చేపడుతున్న చెక్‌డ్యామ్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గతంలోనూ విమర్శలు వచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై పైపైనే పనులు చేస్తూ బిల్లులు మాత్రం ఎక్కువగా చూపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణం బయటకు బాగానే కనిపిస్తున్నప్పటికీ లోపల పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెక్‌డ్యామ్ నిర్మాణంలో ఉపయోగించే కంకర, సిమెంట్, ఇసుక, రాళ్ల విషయంలోనూ నాణ్యత పాటించడం లేదని రైతులు అంటున్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత ఉంటేనే చెక్‌డ్యామ్ ఎక్కువ కాలం మన్నికగా ఉంటుందని, అయితే గుత్తేదారులు నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకుండా పనులను తూతూమంత్రంగా చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. నిర్మాణం కోసం అడుగున గట్టి మట్టి వచ్చే వరకు తవ్వాల్సి ఉండగా, కేవలం పైపైనే తవ్వి పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి నాసిరకం నిర్మాణం వరద నీటి ప్రభావాన్ని ఎంతవరకు తట్టుకుంటుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భవిష్యత్తులో చెక్‌డ్యామ్ దెబ్బతింటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యామ్ పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గుత్తేదారులు, అధికారులు కుమ్మక్కై నాసిరకం పనులు చేపడుతూ ఎక్కువ మొత్తంలో బిల్లులు చూపించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు చెక్‌డ్యామ్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేయాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు. నాసిరకం పనులు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని, నాణ్యతతో నిర్మాణాన్ని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

# భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధించడంపై ప్రధానమంత్రి ప్రశంస

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతంగా నమోదు కావడాన్ని 'అసాధారణ ఘనత'గా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు.

డిచముురు ధరల్లో ఒడుదొడుకులు, సరఫరా వ్యవస్థలో అంతరాయం, ప్రపంచ వ్యాప్త అనిశ్చితి తదితరాల నడుమన సాధించిన ఈ విజయం భారత ప్రజానీకం సమష్టి శక్తికి, దృఢ సంకల్పానికి నిదర్శనమని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

"భారత్ జీడీపీ 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధితో అసాధారణ ఘనతను సాధించింది.

ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి, ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో సమస్యలు వంటి ఎన్ని ప్రతికూలతలు ఎదురైనా మన ప్రజల సమష్టి శక్తిసామర్థ్యాలతో దేశం ఇంతటి వృద్ధిని సాధించగలిగింది.

విపత్తును ఆకాంక్షించే వారి జోస్యాల అంచనాలు తప్పాయి.. భారత్ మరోసారి వికసించింది!" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.ః

# ఎస్‌సీవో సదస్సు నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షునితో ప్రధాని సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీవో సదస్సు నేపథ్యంలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ అధ్యక్షులు డాక్టర్ మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక సంబంధాలపై ఇరు దేశాల నాయకులు చర్చించారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇటీవలి పరిణామాలపై కూడా వారు చర్చించారు. అలాగే మారుతున్న పరిస్థితులపై తమ ఆలోచనలను పంచుకున్నారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతల పట్ల ప్రధానమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే సమస్యలను పరిష్కరించుకోవాలన్న స్థిరమైన భారత్ వైఖరిని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక శాంతిని, స్థిరత్వాన్ని సాధించేందుకు ప్రయత్నాలను కొనసాగించాల్సిన అవసరాన్ని కూడా ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. స్వేచ్ఛాయుతమైన నౌకాయానాన్ని, వాణిజ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. వాణిజ్య నౌకాయానం, నావికులతో సహా పౌరులు, మౌలిక వసతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ హాని తలపెట్టకూడదని ఆయన స్పష్టం చేశారు.

బ్రిక్స్, ఎస్‌సీవోతో సహా బహుపాక్షిక సంస్థల్లో ఇరాన్‌తో సన్నిహిత సహకారానికి భారత్ సంసిద్ధతను ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. అలాగే భారత్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి అధ్యక్షులు పెజెష్కియాన్‌ను స్వాగతించేందుకు ఎదురు చూస్తున్నానని తెలియజేశారు.

# రామగుండంలో 124 శాతం బొగ్గు ఉత్పత్తి

## కార్మికుల రక్షణకు కట్టుబడి ఉన్నాం..

## పరిశ్రమలకు వేగంగా బొగ్గు రవాణా: జీఎం లలిత్‌కుమార్




కరీంనగర్, సెప్టెంబర్ 1: రామగుండం ఏరియా-1లో రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం లలిత్‌కుమార్ తెలిపారు. ఆర్జీ-1 పరిధిలోని బొగ్గు గనులు, ఉపరితల గనుల ప్రాజెక్టుల్లో ఆగస్టు నెలలో 124 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి జీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఆగస్టు నెల ఉత్పత్తి వివరాలను వెల్లడించారు.

ఆగస్టు నెలలో 2,45,200 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 3,04,086 టన్నుల ఉత్పత్తి సాధించినట్లు లలిత్‌కుమార్ వివరించారు. నిర్ణీత లక్ష్యం కంటే అధికంగా ఉత్పత్తి సాధించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రామగుండం ఏరియా నుంచి 2,45,200 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను 2,50,739 టన్నుల బొగ్గును రవాణా చేసి 102 శాతం సాధించినట్లు తెలిపారు.

అదేవిధంగా జీడీకే-1,3 బొగ్గు గనుల్లో 64 శాతం, జీడీకే-2, 2ఏ బొగ్గు గనిలో 71 శాతం, జీడీకే-1ఏ గనిలో 298 శాతం ఉత్పత్తి సాధించినట్లు లలిత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల రక్షణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని జీఎం పేర్కొన్నారు. గనుల్లో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన బొగ్గును వేగంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని లలిత్‌కుమార్ తెలిపారు. సింగరేణి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, రెడ్డిమల్ల తిరుపతి, ఆంజనేయులు, జితేందర్‌సింగ్, వేణు, హనుమంతరావు, వీరారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ప్రధానమంత్రి కిర్గిజ్ అధ్యక్షుడి మధ్య ద్వైపాక్షిక సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:కిర్గిజ్ రిపబ్లిక్ రాజధాని బిష్కెక్ నగరంలో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు ఆ దేశాధ్యక్షుడు గౌరవనీయ సదిర్ జపరోవ్‌తో సమావేశమయ్యారు.

ఇద్దరు నాయకుల మధ్య చర్చల ప్రారంభానికి ముందు- కిర్గిజ్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఇదే రోజున 'ఎస్‌సీఓ' 26వ శిఖరాగ్ర సదస్సు శ్రీకారం చుట్టుకోవడం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నదని పేర్కొన్నారు. సదస్సుకు కిర్గిజ్ ఆతిథ్యంపై అధ్యక్షుడు జపరోవ్‌ను శ్రీ మోదీ అభినందించారు. భారత్-కిర్గిజ్ ద్వైపాక్షిక సంబంధాల్లో ప్రగతిపై వారిద్దరూ తొలుత సమీక్షించారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై తమ నిబద్ధతను పునరుద్ఘాటించారు. రెండు ఆర్థిక వ్యవస్థల నడుమన గల ప్రధాన పరస్పర పూరక అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ- ఆర్థిక, వాణిజ్య సహకారాన్ని మరింత విస్తృతం చేయడంపై ఏకాభిప్రాయానికి వచ్చారు. అలాగే, విద్యా రంగంలో ఆదానప్రదాన కార్యక్రమాలు, సాంస్కృతిక సహకారం సహా ప్రజల మధ్య సంబంధాలను పటిష్టం చేయడంపైనా చర్చించారు. కిర్గిజ్ రిపబ్లిక్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సులో భారత్ అత్యున్నత భాగస్వామ్యాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది రెండు దేశాల మధ్యగల సన్నిహిత, సుదీర్ఘ సంబంధాలతోపాటు పరస్పర గౌరవం, విశ్వాసం, మద్దతును ప్రతిబింబిస్తుందని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అధ్యక్షుడు సదిర్ జపరోవ్ చూపిన ఆత్మీయత, సాదర ఆతిథ్యంతో పాటు ఎస్‌సీఓ శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించడంపై ప్రధానమంత్రి ఆయనకు ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

# ఆర్మేనియా దేశ ప్రధానితో ప్రధానమంత్రి శ్రీ మోదీ భేటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:కిర్గిజ్ దేశంలోని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఆర్మేనియా ప్రధానమంత్రి శ్రీ నికోల్ పషిన్యాన్‌తో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు భేటీ అయ్యారు. ఈ ఏడాది జూన్‌లో ఆర్మేనియాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల అనంతరం శ్రీ పషిన్యాన్ మరోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరువురు ప్రధానులు మధ్య జరిగిన తొలి సమావేశం ఇదే.

ఎన్నికల్లో విజయం సాధించి తిరిగి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శ్రీ పషిన్యాన్‌కు ప్రధాని శ్రీ మోదీ అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఇరువురు నేతలు రక్షణ, ఆర్థిక, ఔషధ, గనులు, విద్య, సాంస్కృతిక రంగాలతో పాటు ద్వైపాక్షిక సహకారంపై చర్చించారు. ఇటీవలి కాలంలో పలు రంగాల్లో భారత్?ఆర్మేనియా సహకారం విస్తరించడంపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన స్నేహపూర్వక, సన్నిహిత సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

పశ్చిమాసియా పరిస్థితులతో సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ప్రాంతంలో శాంతి, సుస్థిరత సాధించేందుకు చర్చలు, దౌత్య మార్గాల ద్వారా నిరంతర ప్రయత్నాలు కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఆర్మేనియా-అజర్‌బైజాన్ శాంతి ఒప్పందం అమలు ప్రస్తుత స్థితిగతులను ప్రధానికి శ్రీ పషిన్యాన్ వివరించారు.

పరస్పర ప్రయోజనం కలిగిన రంగాల్లో సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, భారత్-ఆర్మేనియా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు.

# కరీంనగర్ లాడ్జిలో వేములవాడ వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్, సెప్టెంబర్ 1:కరీంనగర్ నగరంలోని అల్కాపూరి కాలనీ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. వేములవాడకు చెందిన ఓ యువకుడు లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..వేములవాడకు చెందిన నరాల కార్తీక్ (33) ఆదివారం సాయంత్రం 4:30 గంటలకు కరీంనగర్ కు పనిమీద వెళ్తున్నానని చెప్పి కారులో బయలుదేరాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడం, ఫోన్ కు సమాధానం ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్ లో వెతకడం ప్రారంభించారు.

సోమవారం ఉదయం అల్కాపూరి కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని పుల్లల లాడ్జి వద్ద అతని కారు ఉండటాన్ని గుర్తించారు. లాడ్జి సిబ్బంది సహాయంతో గదిలో చూడగా అతను అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడు గతంలో చిట్టీల వ్యాపారం, గత మూడేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ నష్టాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కారణంగానే మనస్తాపానికి గురైనట్లు భార్య ఫిర్యాదులో పేర్కొంది. మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు.

సమాచారం అందుకున్న 1 టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ రామచందర్ రావు తెలిపారు.

# అలుగునూర్‌లో ఇంట్లోకి దూసుకెళ్లిన గూడ్స్ లారీ

## తృటిలో తప్పిన పెను ప్రమాదం.. రెండు షెడ్లు ధ్వంసం

## డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు.. రూ.8 లక్షల నష్టం

కరీంనగర్, సెప్టెంబర్ 1:కరీం నగర్ జిల్లా ఎనిమిదో డివిజన్ అలుగునూర్‌లో మంగళవారం ఉదయం డ్రైవర్ అజాగ్రత్తతో గూడ్స్ లారీ ఇంట్లోకి దూసుకెళ్లింది. రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఇంట్లోకి లారీ దూసుకెళ్లడంతో మెకానిక్‌కు చెందిన రెండు షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో లారీ డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

విద్యుత్ స్తంభం కూడా విరిగిపోయింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.

ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు మెకానిక్ జావ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఘటనపై ఎల్‌ఎండీ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# గోదావరిఖనిలో కాంగ్రెస్ నిరసన



కరీంనగర్, సెప్టెంబర్ 1: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో సోమవారం సాయంత్రం నిరసన చేపట్టారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ పై అక్రమంగా నమో చేసిన ఎఫ్ఐఆర్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, రాజ్యాంగ హక్కుల కోసం, ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గారిని రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులతో వేధించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ ఏరియా అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు గట్ల రమేష్, ముస్తఫా, నెల కంటి రాము, యుగంధర్,దూళికట్ట సతీష్, నాయకులు తిప్పారపు శ్రీనివాస్, దాసరి విజయ్, అనుమ సత్యనారాయణ, కొప్పుల శంకర్, సింహాచలం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# భారత్, బ్రెజిల్ వాణిజ్య పర్యవేక్షక యంత్రాంగం 8వ సమావేశానికి సహాధ్యక్షత వహించిన వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: భారత్, బ్రెజిల్ వాణిజ్య పర్యవేక్షక యంత్రాంగం (ట్రేడ్ మానిటరింగ్ మెకానిజం.. టీఎమ్ ఎమ్) 8వ సమావేశాన్ని బ్రెజిల్ లోని బ్రసిలియాలో నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖలోని వాణిజ్య కార్యదర్శి శ్రీ రాజేశ్ అగర్వాల్‌తో పాటు బ్రెజిల్‌కు చెందిన అభివృద్ధి, పరిశ్రమ, వాణిజ్య, సేవల (ఎమ్‌డీఐసీ) మంత్రిత్వశాఖలో విదేశీ వాణిజ్య కార్యదర్శి తాతియానా లైసర్దా ప్రాజెరెన్ సహాధ్యక్షత వహించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, బ్రెజిల్ అధ్యక్షుడు శ్రీ లూయిజ్ ఇనాసియో లూలా డి సిల్వా నాయకత్వంలో ద్వైపాక్షిక సంబంధాలకు జతకలిసిన రాజకీయ వేగాన్ని మరింత పెంపొందింపచేస్తూ, భారత్, బ్రెజిల్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి అద్దం పట్టే శక్తిమంతమైన సంస్థాగత ప్రాథమిక ప్రణాళికతో పాటు ఇరు పక్షాల వ్యూహాత్మక, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేయడానికి కూడా ఈ సమావేశంలో ఉమ్మడి నిబద్ధతను వ్యక్తం చేశారు.

బ్రెజిల్‌కు చెందిన ఎమ్‌డీఐసీ మంత్రి శ్రీ మార్సియో ఎలియాస్ రోజాతోనూ వాణిజ్య కార్యదర్శి సమావేశమయ్యారు. వారు ఇరువురూ ప్రాధాన్య రంగాల్లో ఆర్థిక సహకారాన్ని పెంపొందించుకోవడం, ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలపరుచుకోవడంపై చర్చించారు. భారత్, బ్రెజిల్ మధ్య ద్వైపాక్షిక వ్యాపారం నిరంతరాయంగా అభివృద్ధి చెందుతూ 2025-26లో 15.07 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయిని అందుకుంది. ఉభయ పక్షాలూ మరింత ఎక్కువ విభిన్న, సమతౌల్య, నిరంతర భాగస్వామ్యాన్ని... మరీ ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, రసాయనాలు, ఇంజినీరింగ్ వస్తువులు, యంత్ర పరికరాల రంగాల్లో.. నెలకొల్పుకుంటూ, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030కల్లా 30 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయికి విస్తరించాలన్న ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించాయి.

భారత్, 'మర్కొసుర్' వాణిజ్య కూటమి పరిశీలనాంశాలలో పురోగతిని ఉభయ పక్షాలూ ఈ సమావేశాల సందర్భంగా సమీక్షించాయి. భారత్, మర్కొసుర్ ప్రిఫరెన్షియల్ ట్రేడ్ అగ్రిమెంటులో విస్తరణ, ఆధునికీకరణలకు సంబంధించిన అనేక అవకాశాలు ఇమిడివున్నాయి. 2025లో భారత్, మర్కొసుర్ ద్వైపాక్షిక వాణిజ్యం 20.84 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయికి చేరుకొంది. పరిశీలనాంశాలను వీలైనంత త్వరలో కొలిక్కి తీసుకువద్దామంటూ ఇరు పక్షాలూ నిబద్ధతను వ్యక్తం చేశాయి. భారతీయ ఔషధ ఉత్పాదనలకు మార్కెట్టు లభ్యతకు మార్గాన్ని సుగమం చేయడంలో కూడా చెప్పుకోదగిన పురోగతి చోటుచేసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కుదిరిన సీడీ ఎస్‌సీఓ-ఏఎన్‌వీఐఎస్‌ఏ అవగాహన ఒప్పందం ఆరోగ్యం, ఔషధాల రంగంలో సహకారం పెంపునకు ఒక ముఖ్య సంస్థాగత పునాదిని అందిస్తోంది. మరింత ఎక్కువ ముందస్తు అంచనాలకు ఆస్కారం ఉండే నియంత్రణ ప్రక్రియలకు మద్దతివ్వడంతో పాటు మార్కెట్టు లభ్యతకు మార్గాన్ని సుగమం చేయాల్సిన అవసరం ఎంతయినా ఉందని భారత్ స్పష్టం చేసింది. నాణ్యమైన మందులను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచే విషయంలో తోడ్పాటును అందించడం ద్వారా ఆరోగ్యసంరక్షణ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు భారత్ దోహదపడనుంది.

వ్యవసాయ రంగంలో, పరస్పర ఆసక్తి ఉన్న కీలక ఉత్పాదనలతో ముడిపడిన ప్రాధాన్య మొక్కల స్వచ్ఛత సంరక్షణ సంబంధిత అభ్యర్థన (ఫైటోశానిటరీ రిక్వెస్టు)లపైనా సమగ్రంగా చర్చించారు. ఉభయ పక్షాల మార్కెట్ల లభ్యతకు సంబంధించి రాయితీలను ఇచ్చే దిశగా సాంకేతిక ప్రక్రియలను నిర్ణీత కాలంలో ముందుకు తీసుకుపోవడానికి ఒక సుస్పష్ట అజెండాను రూపొందించారు. చర్చల సందర్భంగా ఎలక్ట్రానిక్ మౌలిక ధ్రువపత్రాల పరస్పర గుర్తింపు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎమ్ఎస్ఎమ్ఈ), ఔత్సాహిక పారిశ్రామికత్వం, హస్తకళల రంగంలో సహకారం అంశాల్లో ప్రోత్సాహకరమైన ప్రగతి చోటు చేసుకోవడాన్ని సమీక్షించారు. ఇది వాణిజ్యాన్ని సులభతరంగా మార్చడంలోనూ, వాణిజ్య సంబంధిత కార్యకలాపాల్లో ఎదురు కాగల ఇబ్బందులను తగ్గించే దిశగానూ ఒక కీలకమైన అడుగు అని వర్ణించారు.

బ్రిక్స్, జీ20, డబ్ల్యూటీఓ సహా వివిధ బహుళ పక్ష వేదికల్లో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని, ఆంక్షలకు తావు ఉండని, సమ్మిళిత, అభివృద్ధి ప్రధాన బహుళ పక్ష వ్యవస్థను ప్రోత్సహించాలని ఇరు పక్షాలూ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. 2030 సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని బ్రిక్స్ ఆర్థిక భాగస్వామ్య వ్యూహం, 2026-2030 మధ్య కాలానికి గ్లోబల్ వేల్యూ చైన్ (జీవీసీ) కార్యాచరణ ప్రణాళిక.. ఈ రెండిటినీ ముందుకు తీసుకుపోవడంలో బ్రెజిల్ పాలుపంచుకోవడాన్ని భారత్ ప్రశంసించింది. బ్రిక్స్ కూటమికి ఈ సంవత్సరం భారత్ అధ్యక్షత వహించి పూర్తి చేసిన పనులను, ప్రత్యేకించి బ్రిక్స్ స్టార్టప్స్ నాలెడ్జ్ హబ్, బ్రిక్స్ బిజినెస్ ఇంక్యుబేటర్ వంటి కార్యక్రమాల అమలుకు గాను భారత్‌ను బ్రెజిల్ అభినందించింది. ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా భారత్, బ్రెజిల్ ఉన్నత స్థాయి వాణిజ్య సంబంధ స్వాగత కార్యక్రమాన్ని బ్రసిలియాలో నిర్వహించారు. దీనిలో రెండు దేశాలకు చెందిన ప్రముఖ వాణిజ్య ప్రతినిధులతో పాటు పారిశ్రామిక రంగ ఆసక్తిదారులు పాల్గొన్నారు. భారతీయ వాణిజ్య సంస్థలతో కూడిన 25 మందికి పైగా ప్రతినిధుల బృందానికి వాణిజ్య కార్యదర్శి నాయకత్వం వహించారు. బృందంలో కిర్లోస్కర్ గ్రూపు, యూపీఎల్, ఆదిత్య బిర్లా గ్రూపు, తదితర సంస్థల ప్రతినిధులు ఉన్నారు. ఈ వాణిజ్య సంబంధ స్వాగత కార్యక్రమం కీలక ఖనిజాలు, పునరుత్పాదక ఇంధనం, వ్యవసాయ సంబంధిత వాణిజ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఫార్మాస్యూటికల్స్, డిజిటల్ సేవలు, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్), అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి రంగాల్లో సహకారానికి కొత్త అవకాశాలను అన్వేషించడానికి ఒక ప్రధాన వేదికగా నిలిచింది. న్యూఢిల్లీలో అపెక్స్‌బ్రెజిల్ (ం జూ వ లీ ః తీ జీ బ తి శ్రీ ) కార్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు ఇరు పక్షాలూ హర్షాన్ని వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమం వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసి భారత్, బ్రెజిల్ మధ్య పెట్టుబడులను పెంచడానికి తోడ్పడుతుంది. భారత్, బ్రెజిల్ మధ్య చాలా కాలంగా సంబంధాలు ఉన్నాయి. అవి పరస్పర విశ్వాసం, ప్రజాస్వామ్య విలువలు, అంతకంతకు వృద్ధి చెందుతున్న ఆర్థిక సహకారం కారణంగా అంతకంతకు విస్తరిస్తున్నాయి. ఈ పర్యటన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు ఒక కొత్త వేగాన్ని జోడించింది.

# కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

## గుర్తింపు సంఘం ప్రతినిధులతో రామగుండం జీఎం సమీక్ష

కరీంనగర్, సెప్టెంబర్ 1:సింగరేణి బొగ్గు గని కార్మికుల సంక్షేమంపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించిందని రామగుండం ఏరియా జీఎం డి. లలిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కార్యాలయంలో సింగరేణి గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఎం లలిత్‌కుమార్ మాట్లాడుతూ ఓసీపీ-5 జంక్షన్ వద్ద రోడ్డు మరమ్మతులు, కార్మికవాడల్లో ప్రత్యేకంగా వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపడుతున్నామని తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కార్మికవాడల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలని, సెక్టర్-2 నెహ్రూనగర్‌లో పార్కు ఏర్పాటు చేయాలని జీఎం దృష్టికి తీసుకొచ్చారు. అలాగే స్విమ్మింగ్ పూల్‌లో మహిళలకు ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఈ సమీక్ష సమావేశంలో సింగరేణి అధికారులు, గుర్తింపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# నూనెగింజల సాంకేతికతల వాణిజ్యీకరణను వేగవంతం చేసేందుకు హైదరాబాద్‌లో జాతీయ స్థాయి సమావేశం నిర్వహించనున్న ఐసీఏఆర్- ఐఐఓఆర్

న్యూఢిల్లీ, ఆగష్టు 31:హైదరాబాద్‌లోని ఐసిఎఆర్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్ (ఐసిఎఆర్-ఐఐఓఆర్) 2026 సెప్టెంబర్ 10వ తేదీన "సుస్థిర వ్యవసాయం కోసం రకాలు/సంకర రకాలు, బయోలాజికల్స్, బయోపాలిమర్ ఆధారిత మల్టీలేయర్ విత్తన లేపన సాంకేతికతలలో నూతన ఆవిష్కరణలు: సాంకేతికతల వాణిజ్యీకరణ - విస్తరణ కోసం పరిశ్రమలతో భాగస్వామ్యాలు" అంశంపై జాతీయ స్థాయి సంప్రదింపులను పరిశ్రమల ప్రతినిధులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించనుంది.

ప్రపంచంలో వంట నూనెలకు సంబంధించిన ప్రముఖ ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఉన్న భారత్ లో వంటనూనెల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో, స్వయం సమృద్ధిని సాధించడానికి దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాల వేగవంతమైన అభివృద్ధి, వాణిజ్యీకరణ, వినియోగం అత్యంత ఆవశ్యకం. ఈ నేపథ్యంలో, ఐసిఎఆర్ - ఐఐఓఆర్ మెరుగైన నూనెగింజల రకాలు, సంకర రకాలు, బయోపాలిమర్ ఆధారిత విత్తన నాణ్యత పెంపు సాంకేతికతలు, సూక్ష్మజీవుల ఆధారిత జీవ పురుగుమందుల తయారీ విధానాలతో సహా అనేక ఆశాజనకమైన సాంకేతికతలను అభివృద్ధి చేసింది. ఈ సమావేశం విత్తన పరిశ్రమ, జీవ పురుగుమందుల, జీవ ఆధారిత వ్యవసాయ ఉత్పాదకాల తయారీ సంస్థలు, టెక్నాలజీ లైసెన్స్‌దారులు, అగ్రి బిజినెస్ సంస్థలు, అంకుర పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురానుంది. ఈ సందర్భంగా ఐసిఎఆర్ - ఐఐఓఆర్ తమ నూతన సాంకేతికతలను ప్రదర్శించడంతో పాటు, సాంకేతికత బదిలీ, లైసెన్సింగ్, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాలు, విస్తృత స్థాయి విస్తరణకు ఉన్న అవకాశాలను అన్వేషించనుంది.

ఈ కార్యక్రమం పరిశోధన రంగానికి, పరిశ్రమలకూ మధ్య అనుసంధానాన్ని, సంబంధిత భాగస్వాముల మధ్య సహకారాన్ని బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. ఇది వినూత్న సాంకేతికతల ప్రామాణీకరణ, వాణిజ్యీకరణ, వినియోగాన్ని సులభతరం చేయడంతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుస్తూ భారతీయ నూనెగింజల రంగం సుస్థిర అభివృద్ధికి దోహదపడుతుంది.

# శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

## రూ.7.30 లక్షల ఆర్థిక సాయం.. ఇందిరమ్మ ఇల్లు, జీవనోపాధికి భూమి: మంత్రి సీతక్క

ఖమ్మం, ఆగష్టు 31:: హైదరాబాద్‌లో దారుణ హత్యకు గురైన మండల పరిధిలోని చౌటిగూడెం గ్రామానికి చెందిన ఊకే శిరీష కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం పరామర్శించారు. వారి నివాసానికి చేరుకుని తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శిరీష మృతి ఆ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా రూ.1 లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. వీటికి అదనంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి తాము వ్యక్తిగతంగా మరో రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. మొత్తంగా బాధిత కుటుంబానికి రూ.7.30 లక్షల ఆర్థిక సాయం అందుతుందని మంత్రి వివరించారు. అలాగే బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు వారి జీవనోపాధి కోసం భూమి కేటాయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. శిరీష కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ నిపుణ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:నిస్టార్ శ్రేణికి చెందిన రెండో డైవింగ్ సహాయక నౌక ఐఎన్ఎస్ నిపుణ్‌ను భారత నౌకాదళం ప్రారంభించింది. 2026 ఆగస్టు 31న ముంబయిలోని నౌకాదళ ఓడరేవులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సముద్ర మధ్యంలో డైవింగ్, జలాంతర్గత కార్యకలాపాలు, జలాంతర్గాముల రక్షణ సామర్థ్యాలను మెరుగుపరచడంలో ఇదొక కీలక మైలురాయిగా పేర్కొనవచ్చు.

నౌకాదళ ప్రధానాధికారి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ అధ్యక్షతన.. పశ్చిమ నౌకాదళ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్, వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్ సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నౌకాదళ సీనియర్ అధికారులు, విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ప్రతినిధులు, పూర్వ సైనికోద్యోగులు, పలువురు ప్రముఖులతోపాటు నౌకాదళ సిబ్బంది కుటుంబ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్.. దేశీయ పరిజ్ఞానంతో ఈ నౌకను రూపకల్పన చేసి, నిర్మించింది. 'ఐఎన్ఎస్ నిపుణ్' చేరిక.. భారత నౌకాదళ ప్రత్యేక జలాంతర్గత సామర్థ్యానికి మరింత బలాన్ని చేకూర్చింది. సాంకేతికంగా సంక్లిష్టమైన ప్రత్యేక నౌకలను తయారుచేసే స్థాయికి భారత్ చేరుకున్నదనేందుకు ఇది నిదర్శనం. అంతేకాకుండా రక్షణ రంగానికి చెందిన నౌకా నిర్మాణం లో ఆత్మనిర్భరత దిశగా ఇది మరో కీలక ముందడుగు. నౌకాదళ దేశీయ సామర్థ్యాలను పటిష్టం చేసుకోవడంలో దేశంలోని ఓడరేవులు, రక్షణ రంగ పరిశ్రమలు, అనుబంధ సంస్థల పాత్రను కూడా ఇది వెల్లడిస్తోంది.

సముద్ర అగాధాల్లో డైవింగ్, జలాంతర్గత కార్యకలాపాల కోసం ఐఎన్ఎస్ నిపుణ్ నౌకను ప్రత్యేకంగా రూపొందించారు. శాచ్యురేషన్, ఎయిర్, హీలియాక్స్ తరహా డైవింగ్ సామర్థ్యం ఈ నౌక సొంతం. నీటి లోపల పరిశీలనలు, సహాయక చర్యలు చేపట్టడానికి వీలుగా ఇందులో రిమోట్‌తో పనిచేసే అధునాతన వ్యవస్థలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక డైవింగ్ కాంప్లెక్సు, గతిశీల స్థాన నిర్ణయ సామర్థ్యంతోపాటు.. అత్యవసర వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండడంతో, సముద్రంలో దీర్ఘకాలం పాటు సంక్లిష్టమైన ఆపరేషన్లను నిర్వహించడానికి సాధ్యపడుతుంది.

జలాంతర్గాముల రక్షణ చర్యలను చేపట్టే సామర్థ్యం కూడా ఐఎన్ఎస్ నిపుణ్‌కు ఉంది. సముద్ర గర్భంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఇది భారత నౌకాదళానికి ఎంతో దోహదపడుతుంది. ఇప్పటికే సేవలందిస్తున్న తోటి నౌక ఐఎన్ఎస్ నిస్టార్‌తో కలిపి చూస్తే.. డైవింగ్, జలాంతర్గత కార్యకలాపాలు, సముద్రపు అడుగున చిక్కుకున్న వస్తువులను వెలికితీసే చర్యలు, జలాంతర్గాముల రక్షణ రంగాల్లో నౌకాదళ ప్రత్యేక సామర్థ్యం గణనీయంగా పెరిగింది.

నౌక ప్రత్యేక పాత్రను, సముద్ర గర్భంలోకి వెళ్లే నావికుల సాహస పటిమను చాటేలా ఈ నౌకపై చిహ్నం, సూక్తి ఉన్నాయి. 'అగాధాల్లోనూ అందరికన్నా ముందే (ఫార్ బినీత్, ఫ్యూ బియాండ్)' అన్న ఈ వాక్యం.. అత్యంత సవాలుతో కూడిన సముద్రపు లోతుల్లో ఆపరేషన్లు నిర్వహించేందుకు కావలసిన పట్టుదల, నైపుణ్యం, సహనానికి నిదర్శనంగా నిలుస్తుంది.

ఈ సందర్భంగా నౌకాదళ ప్రధానాధికారి (సీఎన్ఎస్) మాట్లాడుతూ.. భారత నౌకాదళం, హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, దేశీయ పారిశ్రామిక రంగాలు కలసికట్టుగా సాధించిన విజయానికి ఐఎన్ఎస్ నిపుణ్ నిదర్శనమన్నారు. ఒకే విడత సముద్ర పరీక్షల్లో అన్ని డైవింగ్ వ్యవస్థల సామర్థ్యాన్ని నిరూపించడం.. దేశ సాంకేతిక ఆత్మవిశ్వాసానికీ, ఇంజినీరింగ్ నైపుణ్యానికీ నిదర్శనమన్నారు.

వివాదాస్పద సముద్ర వాతావరణం పెరుగుతుండడం, ప్రపంచ సముద్ర మార్గాలకు పొంచి ఉన్న ముప్పుల నేపథ్యంలో.. పోరాట సంసిద్ధత భారత నౌకాదళానికి అత్యంత ప్రాధాన్య అంశంగా ఉందని సీఎన్ఎస్ స్పష్టం చేశారు. పశ్చిమ నౌకాదళ కమాండ్ పరిధిలోని పశ్చిమ తీరప్రాంతంలో సేవలందించే ఐఎన్ఎస్ నిపుణ్.. వివిధ రకాల జలాంతర్గత కార్యకలాపాలకు కావాల్సిన ప్రత్యేక సామర్థ్యాలను పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.

ప్రపంచంలో కొద్ది దేశాల నౌకాదళాల వద్ద మాత్రమే ఉన్న ఈ ప్రత్యేక సామర్థ్యాలు.. ఐఎన్ఎస్ నిపుణ సొంతమని సీఎన్ఎస్ పునరుద్ఘాటించారు. ప్రమాదంలో చిక్కుకున్న మన జలాంతర్గాములతోపాటు.. మిత్రదేశాల జలాంతర్గాముల విషయంలో కూడా తక్షణ సహాయక చర్యలకు ఇదెంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీంతో భారత్ ఈ ప్రాంతంలో విశ్వసనీయ జలాంతర్గామి రక్షణ భాగస్వామిగా ఎదుగుతుందని తెలిపారు. అంతేకాకుండా మునిగిన నౌకల నుంచి వస్తువులను బయటకు తీయడం (సాల్వేజ్), మానవతా సాయం, విపత్తు సహాయక (హెచ్ఏడీఆర్) చర్యలను చేపట్టడంలో కూడా ఇది ప్రత్యేకంగా సహాయాన్ని అందిస్తుందని ఆయన వివరించారు.

నౌకాదళ సిబ్బందిని ఉద్దేశించి సీఎన్ఎస్ మాట్లాడుతూ.. వారు ఒక అత్యాధునిక నౌక బాధ్యతలను స్వీకరించడమే కాకుండా, ఆ ఉక్కుకు ఊపిరి పోసి, దానికొక శక్తిమంతమైన రూపాన్నిచ్చే గురుతర బాధ్యతను నిర్వర్తించారన్నారు. 'నిశ్చయ్, నిర్భయ్, నిపుణ్' అనే ఈ నౌక ప్రధాన లక్ష్యానికి అనుగుణంగా నడుచుకోవాలని వారిని కోరారు. అలాగే విధి నిర్వహణ, గౌరవం, ధైర్యం అనే నౌకాదళ మౌలిక విలువలకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఆరంభ పతాకావిష్కరణతో.. భారత నౌకాదళంలోకి ఐఎన్ఎస్ నిపుణ్ అధికారికంగా ప్రవేశించింది. సముద్రపు అలల అడుగున విధులు నిర్వర్తించే నౌకాదళ సిబ్బందికి తోడ్పాటునందిస్తూ.. దేశ నౌకా వాణిజ్య ప్రయోజనాల పరిరక్షణకు సిద్ధంగా ఉంది.

## సాగర్ హైవేపై రాస్తారోకో

### వరద కాల్వకు నీరు విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే భగత్ డిమాండ్

నల్గొండ,సెప్టెంబర్ 1:నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర వరద కాల్వకు నీటిని విడుదల చేయాలని, డీ8, డీ9 కాల్వల ద్వారా నీటిని నింపాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నాగార్జునసాగర్?హైదరాబాద్ జాతీయ రహదారిపై మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఆధ్వర్యలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను పరిష్కరించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం..!

### మిర్యాలగూడలో కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక.. వెయ్యి రోజుల పాలనపై సంబరాలు

నల్గొండ,సెప్టెంబర్ 1:రైతు ధర్నా పేరిట ఈ నెల 3న మిర్యాలగూడకు వస్తున్న బీఆంఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు స్కైలాబ్ నాయక్, చిలుకూరి బాలకృష్ణ తెలిపారు. మిర్యాలగూడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిందని అన్నారు.

తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ప్రజలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిన బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. మిర్యాలగూడ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి, రాజీవ్ గాంధీ విగ్రహానికి సాష్టాంగ నమస్కారం చేసి, ముక్కు నేలకు రాసిన తర్వాతే కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలు మిర్యాలగూడకు రావాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకుండా కేటీఆర్ మిర్యాలగూడకు వస్తే పెద్ద ఎత్తున అడ్డుకుంటామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండు నరేందర్, ఇంద్రకుమార్, మొయిజ్, రవీందర్‌రెడ్డి, నాగునాయక్, బెజ్జం సాయి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి..



ఖమ్మం, సెప్టెంబర్ 1:రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) అశ్వారావుపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో వాల్మీకి కిశోర్‌కు అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ రైతులకు హామీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని, అర్హులైన ప్రతి కుటుంబంలోని మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలం లేని పేదలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పోడు సాగుదారులకు పట్టా హక్కు పత్రాలు అందించాలని, పోడు రైతులు సాగు చేస్తున్న పంటలను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేయడం, పంటలను పీకేయడం వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని నాయకులు కోరారు. ప్రజలకు, రైతులకు, కూలీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బుడితి చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్ తగరం నిర్మల, మండల కార్యదర్శివర్గ సభ్యులు మడకం గోవిందు, మడిపల్లి వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు మొడియం దుర్గారావుతో పాటు మహిళలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పింఛన్ల దరఖాస్తుల గడువు పొడిగింపు

### అర్హులైన వారు సెప్టెంబరు 15లోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సూచన

నిజామాబాద్, సెప్టెంబర్ 1: భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు నూతన పింఛన్లు మంజూరు చేసేందుకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 15, 2026 వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన పింఛన్ల కోసం అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, పైలేరియా బాధితులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన వారు నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.ముఖ్యంగా ఒంటరి మహిళా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు గడువు తేదీకి కనీసం మూడు రోజుల ముందుగానే, అంటే సెప్టెంబరు 12 లోపు తమ దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ సూచించారు. అర్హులైన ప్రజలు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకుని నూతన పింఛన్ల ప్రయోజనం పొందాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

# న్యూ లైఫ్ బట్టల దుకాణాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీసీ కాంప్లెక్స్‌లో మహమ్మద్ సిరాజ్ మార్వానికి చెందిన న్యూ లైఫ్ బట్టల దుకాణాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన దుకాణాన్ని ప్రారంభించి యజమానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ వ్యాపారంలో అంచెలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

నాణ్యమైన బట్టలను అందుబాటులో ఉంచి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలని దుకాణ యజమానికి సూచించారు.

వినియోగదారుల నమ్మకాన్ని పొందేలా వ్యాపారాన్ని కొనసాగించాలని అన్నారు. దుకాణ యజమాని సిరాజ్ మార్వాని మాట్లాడుతూ ప్రారంభోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక ధరలకు వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. రూ.వెయ్యికే నాలుగు చొక్కాలు, రూ.వెయ్యికే నాలుగు ప్యాంట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, టీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్-కవిత మధ్య విభేదాలు తొలగించేందుకు ప్రయత్నించా

### కవిత వ్యాఖ్యలు, ఆరోపణలపై మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందన



నిజామాబాద్, సెప్టెంబర్ 1:బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమార్తె కవిత మధ్య నెలకొన్న విభేదాలను తొలగించి, ఇద్దరినీ కలిపేందుకు తాను ఎంతో ప్రయత్నించానని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భీమ్‌గల్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన.. కవిత ఇటీవల తనపై చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు.

పార్టీ క్రమశిక్షణకు, పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించడం వల్లే కవితపై కేసీఆర్ చర్యలు తీసుకున్నారని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. తాను బీఆంఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆ పార్టీ నేతలతో మంతనాలు జరిపానంటూ వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. కాంగ్రెస్ పార్టీలోని ఏ నాయకుడితోనూ తాను చర్చలు జరపలేదని, లక్ష్మీనరసింహస్వామి సాక్షిగా ఈ విషయం చెబుతున్నానని స్పష్టం చేశారు.

పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెంటే ఉన్నామని ప్రశాంత్‌రెడ్డి గుర్తుచేశారు. బీఆర్ఎస్ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా నిలిచిన నాయకుల్లో తామూ ఉన్నామని అన్నారు. పార్టీ పట్ల తమకు ఉన్న నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. కేసీఆర్, కవిత మధ్య విభేదాలు ఏర్పడిన సమయంలో వాటిని పరిష్కరించేందుకు వ్యక్తిగతంగా తాను చొరవ తీసుకున్నానని తెలిపారు.

కుటుంబం, పార్టీ రెండింటి మధ్య ఏర్పడిన సమస్యలు మరింత ముదరకుండా చూడాలనే ఉద్దేశంతోనే తాను ప్రయత్నించానని చెప్పారు. తాను కాంగ్రెస్ నాయకులతో రహస్యంగా చర్చలు జరిపినట్లు ఆరోపణలు చేస్తున్న వారు అందుకు ఆధారాలు చూపించాలని ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. అదే సమయంలో కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులను కలిశారా? లేదా? అనే విషయాన్ని ఆమెనే ప్రజలకు స్పష్టం చేయాలని ప్రశ్నించారు.

నిరాధారమైన ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు చేయడం ద్వారా తమ మనోభావాలను దెబ్బతీయడం సరికాదని ఆయన అన్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన నాయకులపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వాస్తవ పరిస్థితులు ప్రజలకు త్వరలోనే స్పష్టమవుతాయని ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### 70 గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా సర్వే పనులను వేగవంతం చేయాలి-జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు సెప్టెంబర్ 1::(నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి అన్ని జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే, భూభారతి, తదితర రెవెన్యూ అంశాలపై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించుకొని, దాని ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

రామచంద్రపురం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించేందుకు రూపొందించిన పట్టా పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత రికార్డులు, రైతుల వివరాలను పక్కాగా పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు.

భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు.

అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకొని, నిర్దేశించిన గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి , డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ , అన్ని మండలాల తహసిల్దార్ లు, డిప్యూటీ తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె. చండీశ్వరి దేవి



ములుగు సెప్టెంబర్ 1::(నేటినిజం ప్రతినిధి): ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె. చండీశ్వరి దేవి గారిని మర్యాద పూర్వకంగా కలిసిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గా సేవలందించి పదోన్నతిపై ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా వచ్చిన కె. చండీశ్వరి దేవి గారికి పుష్ప గుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.కలిసిన వారిలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్ ఉన్నారు.

# సీఈఎన్‌జేఓడబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో రెండో సంవత్సరం 'ట్రైడెంట్ లెక్చర్'ను ప్రారంభించనున్న రక్షణ శాఖ సహాయ మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1: సంయుక్త యుద్ధ అధ్యయన కేంద్రం (సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్.. సీఈఎన్‌జేఓడబ్ల్యూఎస్ అఇఔమీచిూ) రెండో వార్షిక ట్రైడెంట్ ఉపన్యాస కార్యక్రమాన్ని రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేఠ్ రేపు, అంటే 2026 సెప్టెంబరు 1న న్యూఢిల్లీలోని మానెక్షా సెంటర్లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో 'దేశ నిర్మాణానికి నవ తరం సామర్థ్యాలను వినియోగించుకోవడం' అంశంపై మంత్రి ప్రత్యేక ప్రసంగాన్నిస్తారు.

సీఈఎన్‌జేఓడబ్ల్యూఎస్ వార్షిక కార్యక్రమాల్లో భాగంగా, 'రక్షణ బలగాల దృష్టికోణం నుంచి జాతీయ పునరుత్థానం' (నేషనల్ రిసర్జెన్స్ త్రూ ది లెన్స్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్) అంశంపై ఒక ఉపన్యాసాన్ని నిర్వహిస్తారు. ఇదే కార్యక్రమంలో.. 'సంయుక్త విన్యాసాలు, ఏకీకరణకు సంబంధించిన సరికొత్త కోణాలు (ఎమర్జింగ్ కాంటూర్స్ ఆఫ్ జాయింట్‌నెస్ అండ్ ఇంటిగ్రేషన్) అంశంపై చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ టు చైర్మన్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ (సీఐఎస్‌సీ), సంయుక్త యుద్ధ అధ్యయన కేంద్రం (సీఈఎన్‌జేఓడబ్ల్యూఎస్) చైర్మన్ ఎయిర్ మార్షల్ తేజిందర్ సింగ్ కీలకోపన్యాసాన్ని ఇవ్వనున్నారు.

దీనికి అదనంగా, 'పౌర, సైనిక సమ్మిళితత్వం: జాతీయ అభివృద్ధికి మార్గం' (సివిల్ మిలటరీ ఫ్యూజన్: ది వే ఫర్ నేషనల్ (గ్రోత్) అంశంపై లెఫ్టినెంట్ జనరల్ రాజ్ శుక్లా (రిటైర్డ్), 'స్మార్ట్ పద్ధతుల్లో పోరాటం: బహుళ రంగాల కార్యకలాపాలు, సంయుక్త భావనలు' (ఫైటింగ్ స్మార్ట్‌లీ: మల్టీ డొమైన్ ఆపరేషన్స్ అండ్ ది కాన్సెప్ట్ ఆఫ్ జాయింట్‌నెస్) అంశంపై సైన్య సిబ్బంది ఉప ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్‌ల ప్రత్యేక ప్రసంగాలు కూడా ఉంటాయి.

ఈ ఉపన్యాసాల కార్యక్రమం సమష్టితత్వం, ఏకీకరణ, బహుళ రంగాల్లో కార్యకలాపాల నిర్వహణ, పౌర సైనిక సమ్మేళనం, దేశ నిర్మాణంలో సాయుధ బలగాల పాత్ర వంటి విషయాలపై చర్చలు జరపడానికి సీనియర్ నాయకత్వాన్ని, ప్రఖ్యాత నిపుణులను ఒక చోట సమావేశపరచనుంది.

సీఈఎన్‌జేఓడబ్ల్యూఎస్‌ను ఏకీకృత రక్షణ సిబ్బంది ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో 2007లో ఏర్పాటు చేశారు. ఇది త్రివిధ దళాల సలహాదారు యంత్రాంగం. ఇది సంయుక్త సంగ్రామం, దేశ భద్రత, దేశంలో ఉన్న శక్తిని ఉపయోగించడానికి సంబంధించిన అంశాలపై పరిశోధన, విశ్లేషణతో పాటు విషయాలు తెలుసుకొని మరీ చర్చించడానికి ఒక వేదికను సమకూరుస్తోంది.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1: భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని నారాయణపేట ఆర్డీవో ఎల్. రమేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 20 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర న్యాయం అందేలా అధికారులు పనిచేయాలని ఆర్డీవో సూచించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ చింతా రవి, ఆర్ఐ వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సెమికాన్ 2.0 గురించి మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ ఈ రోజు మీడియాతో మాట్లాడారు. భారత సెమీకండక్టర్ వ్యవస్థను తదుపరి స్థాయికి తీసుకెళ్లడం పట్ల ప్రభుత్వ దార్శనికతను వివరించారు. భారత్‌లో సెమీకండక్టర్ రూపకల్పన, తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు వేస్తూ... సెమికాన్ 2.0 పథకంలోని ఆరు కీలక విభాగాలకు సంబంధించిన నోటిఫికేషన్లను జారీ చేశారు.

మొదటి సెమికాన్ ఇండియా పథకం ద్వారా పొందిన ఊపును కొనసాగిస్తూ... చిప్ రూపకల్పన, ఫ్యాబ్రికేషన్, ప్యాకేజింగ్ నుంచి పరికరాలు, మెటీరియల్స్, పరిశోధనాభివృద్ధి, ప్రతిభ అభివృద్ధి వరకు మొత్తం సెమీకండక్టర్ వాణిజ్య కార్యకలాపాల వ్యాప్తంగా ఆర్థిక, మౌలిక సదుపాయాల మద్దతును ఈ పథకం అందిస్తుంది.

సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థ సామర్థ్యాలను మెరుగుపరచడం, కీలక రంగాల్లో సాంకేతిక నాయకత్వాన్ని నెలకొల్పడం ద్వారా భారత ఆర్థిక వృద్ధిని, జాతీయ భద్రతనూ బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యం. ఇది 10 కేటగిరీలను కవర్ చేసే ఆరు విభాగాల ఆధారంగా పనిచేస్తుంది.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, "పదేళ్ల కాలంలో 85,000 మంది సెమీకండక్టర్ ఇంజనీర్లను అభివృద్ధి చేయాలన్న తన లక్ష్యాన్ని భారత్ కేవలం నాలుగేళ్లలోనే సాధించింది. ఇప్పుడు మరో లక్ష మంది ఇంజనీర్లను అభివృద్ధి చేయాలనే కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. రాబోయే సంవత్సరాల్లో, ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమ మార్కెటలో దాదాపు 10 శాతం వాటాను భారత్ సాధిస్తుందని అంచనా. టయర్-2, టయర్-3 నగరాల విద్యార్థులు ఇప్పటికే 250కి పైగా చిప్‌లను రూపొందించారు. ఒక సందర్భంలో... శంకుస్థాపన జరిగిన కేవలం 13 నెలల్లోనే వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. పలు సందర్భాల్లో 200 రోజులు, 150 రోజులు, 90 రోజుల్లోనే అనుమతులు మంజూరయ్యాయి. దేశంలో అభివృద్ధి చెందుతున్న సెమీకండక్టర్ వ్యవస్థ ద్వారా 50,000?60,000 ప్రత్యక్ష ఉద్యోగాలూ అందుబాటులోకి వస్తాయని అంచనా వేస్తున్నాం" అని పేర్కొన్నారు.

సెమికాన్ 2.0 కింద మద్దతు పొందిన ప్రాజెక్టులు సాధారణంగా ఆరు సంవత్సరాల వరకు కాలపరిమితిని కలిగి ఉంటాయి. ఈ పథకం ప్రారంభంలో మూడు సంవత్సరాల పాటు దరఖాస్తుల కోసం అందుబాటులో ఉంటుంది.

సెమికాన్ 2.0కు ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది. ఇది దరఖాస్తులను ఆహ్వానించడం... సాంకేతిక, ఆర్థిక మూల్యాంకనం చేపట్టడం... దరఖాస్తుదారులను సిఫార్సు చేయడం... అమలును పర్యవేక్షించడం వంటి పనులు నిర్వహిస్తుంది. ఐఎస్ఎం, సీ-డీఏసీ సహాయంతో రూపకల్పన, విస్తరణ విభాగాలను అమలు చేయవచ్చు. ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి 2026 నుంచి సెమీకండక్టర్ డీప్-టెక్ పురస్కారాలనూ ఈ మిషన్ ప్రకటించవచ్చు.

:ఆర్థిక సహాయం కోసం ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ బడ్జెట్ కేటాయింపులు చేస్తుంది. ఆమోదించిన షరతులకు అనుగుణంగా నోడల్ ఏజెన్సీ ద్వారా చెల్లింపులు చేస్తారు. పథకం ప్రభావాన్ని మూల్యాంకనం చేయడానికి, మార్పులు లేదా కొనసాగింపును పరిగణించడానికి, అమలు చేసిన మూడు సంవత్సరాల తర్వాత లేదా అవసరమైనప్పుడు మధ్యంతర అంచనానూ నిర్వహిస్తారు.

# కాలుష్య రహిత ఇంధన కార్యాచరణ వేగం పెంచాలి




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:జాతీయ స్థాయిలో అత్యంత భారీదైనా "భారత పునరుత్పాదక ఇంధన సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026" (బీఆర్ఈ సమ్మిట్)లో భాగంగా తొలి రెండో రోడ్‌షోలను జైపూర్, ముంబయి నగరాల్లో నిర్వహించారు. ఈ ప్రాంతీయ రోడ్‌షోల పరంపర ఉత్తేజాన్ని హైదరాబాద్‌లో కొనసాగిస్తూ ప్రభుత్వ, పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన రంగ ప్రముఖులు ఈ రోజు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. దేశం 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యం సాధించాలనే లక్ష్యం దిశగా భారత్ శరవేగంగా పురోగమిస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర శక్తియుత కాలుష్య రహిత ఇంధనావరణ వ్యవస్థను జాతీయ స్థాయిలో ప్రస్ఫుటం చేసింది. అంతేకాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల విభిన్న కాలుష్య రహిత ఇంధన సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను కూడా వెల్లడించింది.

పునరుత్పాదక ఇంధన విస్తరణ, సాంకేతికత, తయారీ, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు-పెట్టుబడులు తదితర రంగాల రీత్యా జాతీయ ఇంధన రూపాంతరీకరణలో దక్షిణాదిలోని ఈ మూడు రాష్ట్రాలకూ కీలక, పరస్పర పూరక సామర్థ్యం ఉంది. ప్రగతిశీల విధానాలు, పెరుగుతున్న ఇంధన ప్రాజెక్టుల సంఖ్య, అవకాశాలతో జాతీయ పునరుత్పాదక ఇంధన రంగ వృద్ధిలో తదుపరి దశకు ఈ మూడు రాష్ట్రాలూ శక్తివంచన లేకుండా దోహదం చేయగలవు. ఈ నేపథ్యంలో నవ్య-పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఈ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాల నాయకులు, సస్టెయినబుల్ ప్రాజెక్ట్స్ డెవలపర్స్ అసోసియేషన్, ఇండియన్ సోలార్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చారు.

అంతర్జాతీయ సౌర కూటమి 9వ సమావేశం, గ్రీన్ హైడ్రోజన్‌పై 4వ అంతర్జాతీయ సదస్సుతోపాటు బీఆర్ఈ సమ్మిట్-2026ను నిర్వహిస్తున్నారు. ప్రపంచ అగ్రగాములు, విధాన రూపకర్తలు సహా పారిశ్రామికులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు తదితరులందరూ ఈ సదస్సు ద్వారా ఒకే వేదికపైకి వచ్చారు.

ఈ సందర్భంగా సస్టెయినబుల్ ప్రాజెక్ట్స్ డెవలపర్స్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడు శ్రీ రవివర్మ తొలుత ఆహూతులకు స్వాగతం పలకడంతోపాటు రోడ్‌షో నేపథ్యాన్ని వివరించారు.

ఈ మేరకు పారిశ్రామిక సహకార బలోపేతం లక్ష్యంగా వాటాదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, బీఆర్ఈ సమ్మిట్-2026 వ్యూహాత్మక బృహత్ప్రణాళికను విశదీకరిస్తూ హైదరాబాద్ రోడ్‌షో ఒక సమగ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా కాలుష్య రహిత ఇంధన రూపాంతరీకరణ వైపు భారత్ ప్రస్థానాన్ని వివరిస్తూ, న్యూఢిల్లీ సమ్మిట్ స్థాయిని ఆవిష్కరిస్తూ- 'ఇండియాన్ రెన్యూవబుల్ ఎనర్జీ జర్నీ', 'బీఆర్ఈ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026' పేరిట రెండు చిత్రాలను ప్రదర్శించారు.

అటుపైన నవ్య- పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ సీనియర్ ప్రతినిధి ఒకరు వివిధ అంశాలను విశదీకరించారు. ఈ మేరకు జాతీయ-అంతర్జాతీయ భాగస్వాముల కోసం వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రధానాంశాలు, ప్రతిపాదిత భాగస్వామ్య చట్రం తదితరాల గురించి వివరించారు. అనంతరం 'ఓఈఎం'లు, ప్రాజెక్ట్ డెవలపర్లు, పెట్టుబడిదారులకుగల వ్యాపార అవకాశాలు, వాణిజ్య భాగస్వామ్య నమూనాలపై ఒక ప్రత్యేక గోష్ఠి కూడా నిర్వహించారు. దీంతోపాటు అధికారిక బీఆర్ఈ సమ్మిట్ డిజిటల్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌పై ప్రత్యక్ష ప్రదర్శన-వివరణ కార్యక్రమం కూడా నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) వైస్ ఛాన్సలర్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కమలాకర్ బాబు మెరుపు మాట్లాడుతూ... 2029 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జోడించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత పరిశుద్ధ ఇంధన విధానం-2024 కింద రాష్ట్రం రూపొందించిన ప్రతిష్ఠాత్మక పరిశుద్ధ ఇంధన రోడ్‌మ్యాప్‌ను ఆయన వివరించారు. పునరుత్పాదక ఇంధనం, నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, పరిశుద్ధ ఇంధన తయారీ, పునరుత్పాదక ఇంధన తయారీ జోన్ (ఆర్ఈఎమ్‌జెడ్) వంటి ప్రాజెక్టులతో రాష్ట్ర బలమైన పెట్టుబడి ప్రతిపాదననూ ఆయన వివరించారు. ఇవి ఆంధ్రప్రదేశ్‌ను పరిశుద్ధ ఇంధన పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలుపుతాయని శ్రీ కమలాకర్ బాబు తెలిపారు. పరిశుద్ధ ఇంధన అవకాశాలను ప్రదర్శించడానికి, పెట్టుబడిదారులు, పారిశ్రామిక భాగస్వాములతో చర్చలు జరపడం లక్ష్యంగా భారత పునరుత్పాదక ఇంధన సదస్సు, ఎక్స్‌పో-2026లో క్రియాశీల భాగస్వామ్యం కోసం రాష్ట్రం ఆసక్తిగా ఉందనీ ఆయన తెలిపారు.

తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీమతి బి. రాజేశ్వరి మాట్లాడుతూ... పునరుత్పాదక ఇంధన రంగంలో, ముఖ్యంగా పవన, సౌర విద్యుత్ రంగాల్లో తమిళనాడు సుదీర్ఘకాల నాయకత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో సమీకృత పునరుత్పాదక ఇంధన వ్యవస్థ బలోపేతం కోసం రూపొందించిన ప్రణాళికలను ఆమె వివరించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని అనుసంధానించడంలో, గరిష్ఠ విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఇంధన నిల్వ, పంప్డ్-స్టోరేజ్ ప్రాజెక్టుల ప్రాముఖ్యత పెరుగుతోందని ఆమె స్పష్టం చేశారు. సరళీకృత, ఆన్‌లైన్ ఆమోద ప్రక్రియల ద్వారా పెట్టుబడిదారులకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలనూ శ్రీమతి రాజేశ్వరి ప్రముఖంగా ప్రస్తావించారు.

తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ... పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పరిశుద్ధ ఇంధన తయారీ కోసం ప్రోత్సాహకాలను అందించే పరిశుద్ధ, హరిత ఇంధన విధానం-2025 మద్దతుతో తెలంగాణలో పెరుగుతున్న పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను ప్రముఖంగా ప్రస్తావించారు.

# యూజడ్‌క్యూఆర్ ద్వారా ఉజ్బెకిస్థాన్ వ్యాప్తంగా యూపీఐ చెల్లింపులను ప్రారంభించడానికి ఎన్ఐపీసీ మధ్య భాగస్వామ్యం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:ఉజ్బెకిస్థాన్ జాతీయ చెల్లింపుల వ్యవస్థ అయిన హెచ్‌యూఎంవో ఆపరేటర్ అయిన నేషనల్ ఇంటర్‌బ్యాంక్ ప్రాసెసింగ్ సెంటర్ జేఎస్‌సీ (ఎన్ఐపీసీ)తో నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అంతర్జాతీయ విభాగమైన ఎన్‌పీసీఐ ఇంటర్నేషనల్ పేమెంట్స్ లిమిటెడ్ (ఎన్ఐపీఎల్) 2026 ఆగస్టు 30న ఒక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా భారతీయ ప్రయాణికులు యూపీఐ ఆధారిత అప్లికేషన్లను ఉపయోగించి ఉజ్బెకిస్థాన్ జాతీయ ఇంటర్ ఆపరేబుల్ క్యూఆర్ కోడ్ యూజడ్‌క్యూఆర్‌ను స్కాన్ చేసి ఆ దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులకు తక్షణమే చెల్లింపులు చేయవచ్చు.

ఉజ్బెకిస్థాన్‌లో భారత ప్రధాన మంత్రి ద్వైపాక్షిక పర్యటన సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ), ఉజ్బెకిస్థాన్ సెంట్రల్ బ్యాంకు (సీబీయూ)తో సహా ఆర్థిక నియంత్రణ సంస్థల నుంచి అధికారిక అనుమతులు పొందిన అనంతరం ఈ ఒప్పందం అమల్లోకి వచ్చింది. ఈ సంస్థలు సరిహద్దులకు అతీతంగా వ్యాపార ఆమోదానికి ఎన్ఐపీఎల్ అధీకృత భాగస్వామిగా హెచ్‌యూఎంవోను నియమించాయి.

సార్వత్రిక వర్తక ఆమోదం: సీబీయూ నిర్దేశించిన ఏకీకృత జాతీయ క్యూఆర్ మౌలిక సదుపాయాలతో (యూ జడ్‌క్యూఆర్) అనుసంధానించడం ద్వారా ఉజ్బెకిస్థాన్‌లోని రీటైల్, ఆతిథ్య, సేవా వర్తకుల సార్వత్రిక ఆమోదాన్ని యూపీఐ వినియోగదారులు పొందుతారు.

ఆటంకాలు లేని ప్రయాణ అనుభవం: భారతీయ పర్యాటకులు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు తమ భారతీయ బ్యాంకు ఖాతాల నుంచి నేరుగా పర్సన్?టు?మర్చంట్ (పీ2ఎం) చెల్లింపులను చేయవచ్చు. తద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని మార్చుకోవడంలో ఎదురయ్యే ఇబ్బందులను తొలగిస్తుంది. అలాగే అంతర్జాతీయ కార్డులు, ద్రవ్యంపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది.

బలోపేతమైన ద్వైపాక్షిక సంబంధాలు: డిజిటల్ మౌలిక వసతుల్లో సహకారాన్ని ముందుకు తీసుకెళుతుంది. రెండు దేశాల విస్తృతమైన వ్యూహాత్మక, ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ఈ సహకారం ఉంటుంది.

సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఫ్రాన్స్, మారిషస్, నేపాల్, భూటాన్, ఖతార్, శ్రీలంక, కాంబోడియా, గ్రీస్ దేశాల్లో భారతీయ పర్యాటకులు యూపీఐ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చెల్లింపులు చేస్తున్నారు.

# కేసీఆర్‌పై విమర్శలు మానండి.. హామీల అమలుపై దృష్టి పెట్టండి

మెదక్, సెప్టెంబర్ 1:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మైకు దొరికిన ప్రతిసారీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు ఎంతవరకు జరిగిందో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. నంది ఎవరో.. పంది ఎవరో మీ వెయ్యి రోజుల పాలనే తేటతెల్లం చేస్తోందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి తగదన్నారు. తెలంగాణ ఉద్యమానికి రథసారథిగా నిలిచి, ప్రాణాలను పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. పదేళ్ల పాలనలో సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధు వంటి పథకాలతో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారని గుర్తుచేశారు. వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్ చేసిన పనులను చేయడం సాధ్యం కాదన్నారు. తెలంగాణ చరిత్ర నుంచి కేసీఆర్ పేరును చెరిపివేయడం ఎవరి తరమూ కాదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. పూర్తిస్థాయి రుణమాఫీ, రైతుబంధు, మహిళల సంక్షేమం, నిరుద్యోగ భృతి తదితర హామీల పరిస్థితి ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

# మిషన్ జీరో: పాత వ్యర్థాల నిర్మూలనలో దేపాల్‌పూర్ ఘన విజయం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1:ఇండోర్ నగర పాలక సంస్థ దేపాల్‌పూర్ బాధ్యతను తన పరిధిలోకి తీసుకుంది. కఠినమైన 4-బిన్ వ్యర్థాలను వేరు చేసే విధానాన్ని విజయవంతంగా అమలు చేయడం నుంచి, ఏళ్లుగా పేరుకుపోయిన 1,250 టన్నుల పాత వ్యర్థాలను పూర్తిగా తొలగించడం వరకు సాగిన ఈ మార్పు నిజంగా అద్భుతమైనది.

స్వచ్ఛతా హీ సేవా 2025 సందర్భంగా ప్రారంభించిన 'స్వచ్ఛ షెహర్ జోడీ' కార్యక్రమంతో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సామర్థ్య నిర్మాణానికి, పరస్పర అభ్యాసానికి మరింత ఊతమిచ్చింది. ఈ కార్యక్రమం కింద 72 మార్గదర్శక నగరాలు, 200 నేర్చుకునే నగరాలు పట్టణ వ్యర్థాల నిర్వహణ రంగంలో 1,600కు పైగా కార్యక్రమాలను చేపట్టాయి. ప్రతి ఒక్కరు మరొకరికి నేర్పడం నమూనాపై ఆధారపడిన ఈ 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ... స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (ఎస్‌బీఎం-యూ) కింద పట్టణ వ్యర్థాల నిర్వహణలో చేపట్టిన అతిపెద్ద నిర్దిష్ట సమయ పరిమితి గల మార్గదర్శక వ్యవస్థ. సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పరస్పర అభ్యసనం, ఉత్తమ విధానాల అమలును ప్రోత్సహించడానికి మార్గదర్శక, భాగస్వామ్య నగరాలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ప్రస్తుతం ఈ నగరాలు క్షేత్రస్థాయి పర్యటనలు, మార్గదర్శక నగరాల ఉత్తమ విధానాల వ్యాప్తి ద్వారా ఘన వ్యర్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యూఎం), పట్టణ వ్యర్థాల నిర్వహణలోని (యూడబ్ల్యూఎం) లోపాలను సరిదిద్దుతున్నాయి.

స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0 కింద దేపాల్‌పూర్ "జీరో లెగసీ వేస్ట్" (ఏళ్లుగా ఉన్న వ్యర్థాల సమగ్ర తొలగింపు) దిశగా సాగించిన ప్రయాణం... ప్రజా సంకల్పానికి, శాస్త్రీయ పద్ధతులకు లభించిన విజయానికి నిదర్శనంగా నిలిచింది. 'స్వచ్ఛ షెహర్ జోడీ' కార్యక్రమం కింద ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్, దేపాల్‌పూర్ నగర పరిషత్తులు చేతులు కలిపి ప్రజా భాగస్వామ్యంతో కూడిన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను నిర్మించాయి. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడం, దానిని నాలుగు రకాలుగా వర్గీకరించడం అక్కడ ఇప్పుడు దైనందిన ప్రక్రియగా మారింది. 100 శాతం సేకరణ లక్ష్యం పూర్తయ్యాక, ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు వంటి క్లిష్టమైన సవాలుపై దృష్టి సారించారు.

దీని ఫలితంగా చారిత్రాత్మక సూరజ్‌కుండ్ బావిని పునరుద్ధరించారు. వీధులు రంగురంగుల గోడ చిత్రాలతో ముస్తాబయ్యాయి. ప్లాస్టిక్ రహిత ప్రాంతాలు సాధారణమ్యాయి. మరోవైపు ఇండోర్ కూడా 'బస్తీ బెమిసల్' అనే స్ఫూర్తిదాయకమైన మురికివాడల రూపాంతరీకరణ ప్రచారంతో తన ప్రాథమిక వసతులను మెరుగు పరుచుకుంటోంది.

మేయర్ శ్రీ పుష్యమిత్ర భార్గవ్, కమిషనర్ ఐఏఎస్ క్షితిజ్ సింఘాల్ నాయకత్వంలో దేపాల్‌పూర్ దాదాపు 5 ఏళ్లుగా పేరుకుపోయిన 1,250 మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిస్థాయిలో శుద్ధి చేసి, తన డంప్ యార్డును వ్యర్థ రహితంగా మార్చి సరికొత్త మైలురాయిని సాధించింది.

దేపాల్‌పూర్‌లో చేపట్టిన ఈ కార్యక్రమం స్థాయి సాధారణమైనది కాదు. ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 500 మందికి పైగా చెత్త సేకరించే కార్మికులు రంగంలోకి దిగి, దేపాల్‌పూర్ నగర్ పరిషత్‌కు చెందిన డంపర్లు, జేసీబీలు, లోడర్ల వంటి భారీ యంత్రాల సాయంతో ఎంతో కృషి చేసి ఏళ్లుగా పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. ఇందుకోసం పక్కా ప్రణాళికతో వ్యర్థాలను అక్కడికక్కడే వివిధ రకాలుగా వేరు చేసి, ప్రతి వ్యర్థాన్ని దాని సరైన గమ్యస్థానానికి తరలించారు. ఈ ప్రక్రియలో ప్లాస్టిక్, లోహం, గాజు వంటి 4.5 టన్నుల పునర్వినియోగ వ్యర్థాలను సేకరించి, అధీకృత రీసైక్లర్లకు విక్రయించారు. మరోవైపు 50?60 టన్నుల రిఫ్యూజ్ డెరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్‌డీఎఫ్)ను ఇండోర్‌లోని నెప్రా ప్లాంటుకు తరలించి, అక్కడ దానిని ముక్కలు చేసిన అనంతరం సిమెంట్ కర్మాగారాలకు కో-ప్రాసెసింగ్ కోసం పంపించారు. సేకరణ, విభజన, శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్, అధీకృత మార్గాల్లో తరలింపు ఇలా ప్రతి దశలోనూ కనిపించిన క్రమశిక్షణ, సమర్థత, సుస్థిరత పట్ల నిబద్ధత ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి.

వ్యర్థాల శుద్ధీకరణ పూర్తయిందని ప్రకటించే సమయానికి ఒకప్పుడు భూమిపై మచ్చలా కనిపించిన ఆ డంప్ యార్డ్.. పునరుజ్జీవనానికి వేదికగా మారింది. భూమికి కొత్త జీవం పోస్తున్న సంకేతంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి 200 మొక్కలను నాటారు. అనంతరం స్థానిక ప్రజలతో కలిసి నిర్వహించిన 'పోహా పార్టీ' ఈ విజయాన్ని అందరి గర్వానికి, భాగస్వామ్యానికి ప్రతీకగా మార్చింది. ఇకపై ఈ ప్రదేశాన్ని క్రికెట్ మ్యాచ్‌లు, పౌరుల భాగస్వామ్య కార్యక్రమాలు, 'టిఫిన్ పార్టీ' వంటి సామాజిక సమావేశాలకు వేదికగా ఉండే ప్రజా స్థలంగా తీర్చిదిద్దనున్నారు. ఒకప్పుడు వ్యర్థాల కుప్పగా ఉన్న ప్రదేశం ఇప్పుడు పచ్చదనం, సందడితో నిండిన సామాజిక వేదికగా మారబోతోంది. సంకల్పం, ప్రణాళిక, సమష్టి భాగస్వామ్యంతో డంప్‌యార్డ్‌ను పౌర విజయానికి ప్రతీకగా ఎలా మార్చవచ్చో దేపాల్‌పూర్ చాటి చెప్పింది. స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమం కింద 'జీరో లెగసీ వేస్ట్' (పాత వ్యర్థాలను పూర్తిగా తొలగించడం) సాధించిన తొలి నగరంగా దేపాల్‌పూర్ నిలిచింది.

# సంప్రదాయానికి ప్రతీక, స్థిరత్వానికి మూలం...కొబ్బరి దినోత్సవం

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం నిర్వహిస్తారు. జీవన వృక్షం అని ప్రసిద్ధి చెందిన కొబ్బరి చెట్టు ప్రాధాన్యతను చాటడం, దాని ఆధారంగా జీవనోపాధి సాగిస్తున్న కోట్లాది మంది రైతుల కృషిని గుర్తించడం, పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడడం ఈ దినోత్సవం వెనుక ప్రధాన ఉద్దేశ్యం. ఆసియా పసిఫిక్ కొబ్బరి సమాజం అనే అంతర్జాతీయ సంస్థ 1999లో స్థాపించ బడింది. దీనిని పురస్కరించుకుని 2009లో మొదటి.సారిగా ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ 2న దీన్ని గుర్తుగా పాటిస్తున్నారు. ఈ సంస్థలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన 18 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. కొబ్బరి పంట ఉత్పత్తి, వినియోగం, అంతర్జాతీయ మార్కెట్ విస్తరణ, రైతుల ఆదాయాభివృద్ధి లక్ష్యాలతో ఈ వేదిక ఏర్పడింది.

కొబ్బరి చెట్టును కల్పవృక్షం అని పిలవడానికి కారణం దాని ప్రతి భాగం ఉపయోగకరమై ఉండడమే. వేర్లు, కాండం, ఆకులు, పండు అన్నీ మానవ జీవితానికి ఉపయోగ పడతాయి. కొబ్బరి నీరు సహజమైన ఎలక్ట్రోలైట్‌లకు నిలయం. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీటిలో సుమారు 19 క్యాలరీలు, 4 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 25 మిల్లీ గ్రాముల సోడియం ఉంటాయి. క్రీడాకారులకు, శ్రమతో జీవించే వారికి ఇది సహజ శక్తినిస్తుంది. కొబ్బరి నూనెలో 90 శాతం మధ్యస్థ శృంఖల కొవ్వు ఆమ్లాలు (ఓఉబ) ఉంటాయి. వీటిలో లౌరిక్ ఆమ్లం శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. కొబ్బరి పాలు విటమిన్ సి, ఇ, బి కంప్లెక్స్, ఇనుము, మగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలతో నిండిపోయి ఉంటాయి. కొబ్బరి తురుము మిఠాయిలు, వంటకాల్లో రుచిని పెంచడమే కాకుండా అధిక ఫైబర్‌తో జీర్ణక్రియకు తోడ్పడుతుంది.

కొబ్బరి చెట్టు ఆకులను గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పైకప్పుల కోసం, చాపలు, ముట్టెలు తయారీకి ఉపయోగిస్తారు. పీచు నుండి తాడులు, గోనె సంచులు, పరుపులు, బ్రష్‌లు తయారవుతాయి. తాటి కాండంతో గృహోపకరణాలు, ఫర్నిచర్ తయారు చేస్తారు.

చిప్పలను బయోమాస్ ఇంధనంగా వినియోగిస్తారు. కొబ్బరి చెట్టు వాణిజ్య, పారిశ్రామిక, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అమూల్యమైన వనరుగా నిలుస్తుంది.

ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి సుమారు 6.3 కోట్ల మెట్రిక్ టన్నుల కొబ్బరి ఉత్పత్తి అవుతుంది. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, భారతదేశం మూడు ప్రధాన ఉత్పత్తి దారులు. వీటి లోనే ప్రపంచ ఉత్పత్తిలో 70 శాతం వస్తుంది. భారత దేశం

## సెప్టెంబర్ 2... ప్రపంచ కొబ్బరి దినోత్సవం




రెండవ అతిపెద్ద ఉత్పత్తిదారు. 2023 గణాంకాల ప్రకారం దేశంలో 21 లక్షల హెక్టార్లకు పైగా కొబ్బరి సాగు విస్తరించి ఉంది.

సంవత్సరానికి సుమారు 1.9 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేరళ ఒక్కదాని లోనే దేశీయ ఉత్పత్తిలో 40 శాతం వస్తుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, గోవా కూడా ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాలు. దేశ వ్యాప్తంగా సుమారు 20 కోట్ల ప్రజలు ప్రత్యక్ష, పరోక్షంగా కొబ్బరి ఆధారిత జీవనోపాధిపై ఆధారపడి ఉన్నారు.

కొబ్బరి ఉత్పత్తుల ద్వారా భారత దేశం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది.

కోయిర్ ఉత్పత్తులు, కొబ్బరి నూనె, ఎండు కొబ్బరి, కొబ్బరి నీటితో తయారైన పానీయాలు, హ్యాండ్‌క్రాఫ్ట్ ఎగుమతుల్లో ప్రధాన భాగం. కేవలం కోయిర్ ఉత్పత్తుల ద్వారానే 2022?23 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4,340 కోట్ల రూపాయల ఎగుమతులు జరిగాయి. ఈ పరిశ్రమలో లక్షలాది మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు.

అయితే కొబ్బరి పరిశ్రమకు సవాళ్లు తక్కువ కావు. దేశ వ్యాప్తంగా పంటలో 30 శాతం చెట్లు వయసు పైబడినవే. దిగుబడి తగ్గిపోవడం సహజం. కొత్తగా నాటే మొక్కలకు ప్రోత్సాహక పథకాలు అవసరం. కొబ్బరి చెట్లకు రూట్ విల్ట్, బ్లాక్ హెడ్, కీటకాల దాడి వంటి వ్యాధులు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి.

మార్కెటింగ్ సౌకర్యాల లేమి, శ్రామికుల కొరత రైతుల సమస్యలలో ముఖ్యమైనవి. ఒక చెట్టుపైకి ఎక్కి కాయలు కోయగల నైపుణ్యం కలిగిన శ్రామికులు రోజురోజుకూ తగ్గిపోతున్నారు. దీంతో రైతులు అధిక ఖర్చులు పెట్టాల్సి వస్తోంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం ఈ సమస్యలను గుర్తించడానికి, వాటి పరిష్కార మార్గాలను చర్చించడానికి ఒక మంచి వేదిక. ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన థీమ్ ప్రకటించి రైతుల ఆదాయాభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు, సాంకేతికత వినియోగం, మార్కెట్ విస్తరణ వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. కొబ్బరి పరిశ్రమ భవిష్యత్తు స్థిరంగా ఉండాలంటే పంట సంరక్షణ, నూతన ఆవిష్కరణలు, పరిశోధనలతో పాటు రైతులకు ఆర్థిక రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది.

ప్రపంచ కొబ్బరి దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ఇది జీవనానికి, ఆర్థికాభివృద్ధికి, ఆరోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. కోట్లాది మంది రైతుల కష్టానికి గౌరవం ఇవ్వడం, ఈ వనరును భావి తరాలకు కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రకృతి మనకు ప్రసాదించిన ఈ కల్ప వృక్షాన్ని కాపాడు కోవడం ద్వారానే గ్రామీణాభివృద్ధి, స్థిరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

---

# పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే పట్టుదలతో కృషి చేయాలి

## ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫౌండేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.



సంగారెడ్డి, సెప్టెంబర్ 01(నేటి నిజం ప్రతినిధి) పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కష్టపడి చదువుతూ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్‌ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రతి పోటీ పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరవుతున్నారని, పోటీ తీవ్రంగా ఉందని అన్నారు. అయితే పోటీని చూసి నిరుత్సాహపడకుండా ఏకాగ్రత, క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు.

పోటీ పరీక్షలకు అవసరమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అన్నారు. చదువులో క్రమశిక్షణ పాటిస్తూ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు.

"మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. పట్టుదలతో, ఆత్మవిశ్వాసంతో చదివితే విజయం సాధించడం సాధ్యమే" అని కలెక్టర్ విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.

జీవితంలో ప్రతి ఒక్కరికీ అనేక సమస్యలు, సవాళు ఎదురవుతాయని, వాటిని అధిగమించే విధానం మన ఆలోచనా దృక్పథంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు.

విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణ వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు నిరంతరంగా కృషి చేయాలని సూచించారు.అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని తరగతి గదులు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూడాలని, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, స్టడీ సర్కిల్‌లోని సదుపాయాలను మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు సూచించారు.

ఈ సందర్భంగా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ మాట్లాడుతూ, ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు పరీక్షల విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి..

## ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీలో కమిషనర్ గౌష్ ఆలం

కరీంనగఫ్, సెప్టెంబర్ 1:కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ మంగళవారం వార్షికంగా తనిఖీ చేశారు. కమిషనర్ స్టేషన్‌కు చేరుకోగానే సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం స్టేషన్ ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి మొక్కలు నాటారు.

స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, నేర రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, ఫిర్యాదుల స్వీకరణ కేంద్రం నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. లాకప్ గదులు, ఆయుధాగారం, భద్రతా విభాగాలను తనిఖీ చేశారు. గ్రామాల వారీగా హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలు, పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు.

నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. నేర నియంత్రణకు పటిష్ట నిఘా చర్యలు చేపట్టడంతో పాటు రాత్రి గస్తీ, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ల తిరుగుబాట్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజల భద్రతకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజల్లో పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని గౌష్ ఆలం అన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాంకేతిక ఆధారాలను సేకరించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేసి నిందితులకు తగిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రధాన కూడళ్లు, గ్రామాలు, కాలనీలలో 'నేను సైతం' ప్రాజెక్టు కింద సీసీ కెమెరాల సంఖ్యను పెంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్, ఎల్ఎండీ సబ్-ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా, పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

---

# అసమర్థ పాలనపై బీఆర్ఎస్ సమరభేరి



ములుగు సెప్టెంబర్ 1::(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 33 నెలలు గడుస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 14 డిక్లరేషన్లను విస్మరించి ప్రజలను ఘోరంగా మోసం చేసిందని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ధ్వజమెత్తింది. పార్టీ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీష్ రావుల పిలుపు మేరకు కాంగ్రెస్ అసమర్థ పాలనను ఎండగడుతూ ఏడు రోజుల నిరసన కార్యక్రమంలో భాగంగా ప్రెస్ మీట్ నిర్వహించారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ములుగు నియోజకవర్గ ఇన్చార్జ్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

ఆడబిడ్డలకు రూ. 660 కోట్లు బాకీ: మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 ఇస్తామని చెప్పి ములుగులోని 80 వేల మంది మహిళలకు రూ. 660 కోట్లు బాకీ పడ్డారు. తులం బంగారం హామీని నీరుగార్చారు. ఉచిత బస్సు పేరుతో వరంగల్, ములుగు, ఏటూరునాగారం, భద్రాచలం రూట్లలో బస్సులు తగ్గించి చార్జీలు పెంచి ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారు.

రైతాంగానికి పంగనామా: కేసీఆర్ హయాంలో రైతుబంధు సకాలంలో పడేది. కాంగ్రెస్ ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ఎగ్గొట్టింది. రైతు భరోసా, రుణమాఫీ, కౌలు రైతులకు రూ. 12,000 హామీలు నెరవేర్చలేదు.అన్ని వడ్లకు బోనస్ అని చెప్పి సన్న వడ్లు 5 రకాల కే రూ. 500 బోనస్ అని చెప్పి రైతులకు తీరని ద్రోహం చేశారు.

ఏజెన్సీ పోడు భూముల సమస్యలు: కేసీఆర్ పోడు భూములకు పట్టాలిచ్చి రైతులను రాజులను చేస్తే, కాంగ్రెస్ వచ్చాక తాడువాయి, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని, స్థానిక మంత్రి సీతక్క దీనిపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు.

ధ్వంసం: 24 గంటల నాణ్యమైన కరెంట్ పోయి మోటర్లు కాలిపోయే పరిస్థితి వచ్చింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అని షాకింగ్ బిల్లులు ఇస్తున్నారు. రూ. 5 లక్షల విద్యా భరోసా, అమ్మాయిలకు స్కూటీలు, 2 లక్షల ఉద్యోగాల హామీలన్నీ అబద్ధాలని తేలిపోయాయి.

ములుగు స్థానిక సమస్యలపై నిర్లక్ష్యం: ములుగు ఏరియా ఆసుపత్రి, ఏటూరునాగారంలో డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్, బస్ డిపో, కరకట్ట నిర్మాణం, దేవాదుల పంప్ హౌస్ ద్వారా చెరువులు నింపే ప్రక్రియను స్థానిక మంత్రి సీతక్క పూర్తిగా విస్మరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు, హైడ్రా విధ్వంసాలు, భూదందాలను తెలంగాణ సమాజం గమనిస్తోందని, రాబోయే రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పోరిక గోవింద నాయక్, తుమ్మ మల్లారెడ్డి,తాటి కృష్ణ, భూక్యా జంపన్న, మాజీ ఎంపీపీ వినయ్ కుమార్, మల్కా రమేష్, తాడూరి రఘు, దయ్య అశోక్, రమేష్ రెడ్డి, లింగాల రమణారెడ్డి, నరసింహ నాయక్, చేన్న విజయ్, ఎండి ఖాజా పాషా,పాలెం శ్రీనివాస్, చిన్ని కృష్ణ, కోయిల మహేష్, బాడిశే నాగ రమేష్, చిట్టి మల్ల సమ్మయ్య, భూక్యా అమర్ సింగ్, ముడతన పెల్లి మోహన్, ముంజల బిక్షపతి, పోరిక విజయ్, బైక్ అని ఓదేలు, కోళ్ల వెంకన్న, కర్ర రవీందర్, వేణుగోపాల్, కుమ్మరి చంద్ర బాబు, జాడి బోజరావు, మరియు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, జిల్లా నాయకులు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

---

# ధాన్యం కల్లం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ కార్యాలయ మట్టడి

## నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన రైతులు



కామారెడ్డి, సెప్టెంబర్ 1:(నేటినిజం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలంలోని మంగుళూరు గ్రామానికి చెందిన రైతులు మంగళవారం నిజాంసాగర్ తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. తమ గ్రామంలో వరి ధాన్యం ఆరబెట్టుకునేందుకు వరి ధాన్యం కల్లం ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు తహసీల్దార్ గతంలో ప్రజావాణిలో ఫిర్యాదులు చేశామని గ్రామంలోని సర్వే నంబర్ 165లో సుమారు 195 ఎకరాల భూమి ఉందని రైతులు తెలిపారు.గ్రామంలో సుమారు 750 ఎకరాల్లో సాగు భూమి ఉండటంతో ప్రతీ సంవత్సరం వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సుమారు 7 నెలల కిందట తహసీల్దార్ కు రెండు నెలల కిందట కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలేదని వారు పేర్కొన్నారు. తమకు వెంటనే వారి ధాన్యం కల్లాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్ కార్యాలయం ముందు బైఠాయించి నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో కార్యాలయ సిబ్బందికి మరో మారు వినతిపత్రం అందజేశారు.

---

# కేసీఆర్ నామస్మరణ మాని ఎన్నికల హామీలు అమలు చేయండి..

## -మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్, సెప్టెంబర్ 1: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం కేసీఆర్ నామస్మరణ, ఆయనపై విమర్శలు చేయడం మాని, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హితవు పలికారు. లింబాద్రి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు బాకీ కార్డులతో మంగళవారం పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రజలకు ఏమీ చేయలేదని, రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూసీ నదిపై తాము నిర్మించిన వంతెనను నిన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, కేవలం రిబ్బన్ కటింగ్‌లు చేస్తూ బీఆర్ఎస్ పనులను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.అభివృద్ధి గురించి మాట్లాడకుండా అక్కడ కూడా మూసి కంటే కంపు నోరుతో కేసీఆర్‌పై విషం కక్కేందుకే సమయం కేటాయించారని ఎద్దేవా చేశారు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్నామని వేముల స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ గారు 100 శాతం సంపూర్ణ బాధ్యతతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ మేధోమథనం, వ్యూహాత్మక దిశానిర్దేశం



ప్రకారమే పార్టీ నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎండగడుతోందని వేముల అన్నారు.

ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యుల అవినీతి, భూ ఆక్రమణలపై నిరంతరం పోరాటం సాగిస్తున్నామని, 'హైడ్రా' పేరుతో సాగిస్తున్న అరాచకాలు, మూసీ ప్రక్షాళన పేరుతో జరుగుతున్న భారీ అవినీతిని ప్రశ్నిస్తున్నామని పేర్కొన్నారు.

లగచర్లలో రైతుల భూములను అన్యాయంగా లాక్కోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ప్రతిష్టాత్మక ఫార్మాసిటీని రద్దు చేసి, 'ఫ్యూచర్ సిటీ' పేరుతో 14,000 ఎకరాల విలువైన భూములను అమ్ముకునేందుకు జరుగుతున్న కుట్రలను ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు.

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత వెల్లడించిన రూ.200 కోట్ల భూ ఆక్రమణల ఉదంతంతో సహా కాంగ్రెస్ నాయకుల అక్రమాలను నిలదీస్తున్నామని చెప్పారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: BAISA DEVADAS.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.